ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
మంగళవారం 9 సెప్టెంబరు 2025 | 5





మున్సిపోల్స్ సందడి

వీడిన గ్రహణం

తెరుచుకున్న ఆలయాలు

- చంద్రగ్రహణం అనంతరం సంప్రోక్షణ చేసి ఆలయాలను తెరిచిన అర్చకులు
- స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న భక్తులు 6

శునకాల నియంత్రణకు ఓ ఐడియా 6

అమలాపురం పురపాలక సంఘంలో కుక్కల నియంత్రణకు సంబంధించి పశుజనన నియంత్రణ భవనాన్ని ప్రత్యేకంగా నిర్మించారు. ఇక్కడ ప్రత్యేక వైద్యసిబ్బందితో వాటికి జనన నియంత్రణ శస్త్రచికిత్సలతోపాటు యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌లు అందిస్తున్నారు. కొన్నాళ్లు వాటికి అవసరమైన తిండి, మంచినీరు అందించి సంరక్షించి తర్వాత తీసుకువచ్చిన చోటే విడిచిపెడుతున్నారు.



అమలాపురం పట్టణంలో పశుజనన నియంత్రణ కేంద్రం వద్ద శస్త్రచికిత్స అనంతరం ప్రత్యేక షెల్టర్‌లో విశ్రాంతి తీసుకుంటున్న వీధికుక్కలు



బార్లా తెరిచినా!

నో చీర్స్ — బార్ల దరఖాస్తులకు వెనుకంజ

- ఎక్సయిజ్‌శాఖ నానా తంటాలు
- రెండోసారి బార్ల దరఖాస్తులకు పాట్లు
- మద్యం వ్యాపారులపై అదేపనిగా ఒత్తిళ్లు
- దరఖాస్తులు చేసి తీరాలని మీటింగ్‌లు
- లేదంటే దాడులు తప్పవని హెచ్చరికలు
- 14 వరకు దరఖాస్తు గడువు
- అధికారుల్లో బదిలీ భయం

(కాకినాడ/రాజమహేంద్రవరం,ఆంధ్రజ్యోతి)
ఉమ్మడి జిల్లాలో బార్ల లైసెన్సులకు దరఖాస్తులు రప్పించడం కోసం ఎక్సైజ్‌శాఖ తంటాలు పడుతోంది. తొలిసారి పిలిచిన బార్లకు స్పందన రాకపోవడంతో రెండోసారైనా ఫలితం వచ్చేలా చేయడానికి తెగ ప్రయత్నిస్తోంది. ఉన్నతాధికారుల ఒత్తిళ్లు ఎక్కువగా ఉండడంతో ఎలాగైనా పని పూర్తయ్యేలా చేయడం కోసం తమ అధికారాలకు సైతం పదును పెడుతున్నారు. కొందరు మద్యం వ్యాపారులకు కబుర్లు పంపి బార్లను దక్కించుకోవాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. సిండికేట్లతో మాట్లాడుకుని అయినా నలుగురూ కలిపి ముందుకు రావాలంటూ ఆదేశాలిస్తున్నారు. లేదంటే ఎమ్మార్పీ ఉల్లంఘనలు, బెల్ట్ కేసులు తప్పవంటూ పరోక్ష హెచ్చరికలు చేస్తున్నారు. పాత బార్ల నిర్వాహకులను పిలిచి సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు.బార్లను దక్కించుకుంటే సహకరిస్తామని భరోసా ఇస్తున్నారు. ఇంత చేసినా ఈ నెల 14 నాటికి అనుకున్న ఫలితం వస్తుందో రాదోనన్న బెంగ వీరిని వేధిస్తోంది.



అధికారుల ఒత్తిడి..

ఎలాగైనా అన్ని బార్లకు నాలుగేసి చొప్పున దరఖాస్తులు పడేలా చేయడానికి రకరకాల వ్యూహాలు అమలు చేస్తున్నారు. చాలా మంది తమకు ఆసక్తి లేదని అధికారులకు తెగేసి చెప్పేస్తున్నారు. ఇప్పటికే మద్యం దుకాణాలతో రాబడి లేక ఇబ్బంది పడుతున్నామని, ఒక్కో దరఖాస్తుకు రూ.5లక్షల నాన్‌రిఫండబుల్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేయలేమని చెబుతున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులు రెండోసారి డ్రా సమయానికి దరఖాస్తులు వచ్చేలా కనిపించకపోవడంతో ఎక్సయిజ్ అధికారులు పరోక్ష హెచ్చరికలకు దిగుతున్నారు. దీంతో కొందరు వ్యాపారులు దారికి వస్తుండగా.. మరికొందరు ఏం చేయలేమని తెగేసి చెప్పేస్తున్నారు. ప్రధానంగా కాకినాడ, రాజమండ్రి, అమలాపురం ప్రాంతాల్లో బార్ లైసెన్స్ ఫీజులు భారీగా ఉండడంతో అసలు వ్యాపారులు దరఖాస్తులు చేయడానికి ముందుకు రావడంలేదు.14లోపు అన్ని బార్లకు దరఖాస్తులు వచ్చేలా చేసే బాధ్యత పైఅధికారులు తమకు అప్పగించడంతో ఈపని ఎలా పూర్తి చేయాలో తెలియక ఎక్సయిజ్ అధికారులు తంటాలు పడుతున్నారు.అయితే ఈసారి కూడా వ్యాపారస్తులు సారీ అంటున్నారు. ఈ టార్గెట్ పూర్తిచేయకపోతే ఎక్కడ బదిలీ వేటు పడుతుందోనని కొందరు సీఐలు హడలిపోతున్నారు.మొదటి నోటిఫికేషన్‌కి అధికారుల బెదిరింపులు తట్టుకోలేక కొందరు దరఖాస్తులు సమర్పించారు. కేవలం ఇప్పటి వరకూ వ్యాపారం చేసిన చోటు పోతుందని ప్రస్తుత వ్యాపారస్తులు కొందరు దరఖాస్తులు సమర్పించడానికి సిద్ధం అవుతున్నారు.ఇప్పటికే పాత బార్‌ల వద్ద 16 నుంచి పునఃప్రారంభిస్తామని బోర్డులు పెట్టడం అందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. మరో వైపు బార్ వ్యాపారస్తుల్లో అంతర్గతంగా పోటీ ఎక్కువ కావడంతో స్థలం, షాపుల అద్దెలు ఆయా యజమానులు భారీగా పెంచేశారు.

53కి 15 లైసెన్స్‌లు..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కేటాయించిన బార్లకు లైసెన్స్ గడువు ముగియడంతో అధికారులు ఇటీవల కొత్తగా బార్‌పాలసీ ప్రకటించారు. బార్లకు వేలం విధానం ఎత్తివేసి కొత్తగా లాటరీ విధానం ప్రవేశపెట్టారు. ప్రతి బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ తీస్తామని నిబంధన విధించారు. ఒక్కో దరఖాస్తుకు రూ.5 లక్షల ఫీజు చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో జనరల్, కల్లుగీత కార్మికులకు కలిపి మొత్తం 53 బార్లకు ఆగస్టు 18న గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారు. ఒక్కో బార్‌కు దరఖాస్తు ఫీజు రూ.5 లక్షలు, లైసెన్స్ ఫీజు ఏరియా ఆధారంగా రూ.55 లక్షల వరకు నిర్ణయించారు. 2025 నుంచి 2028 వరకు బార్ లైసెన్స్ కొనసాగుతుందని ప్రకటించారు. వేలం విధానానికి బదులు డ్రా తీసే విధానం అమల్లోకి తేవడంతో భారీ ఎత్తున వ్యాపారుల నుంచి పోటీ ఉంటుందని అధికారులు భావించారు. తీరా మొత్తం వ్యూహం బెడిసికొట్టింది. గత నెల 26 నాటికి దరఖాస్తుల గడువు ముగియగా వచ్చిన అప్లికేషన్లు సున్నా. దీంతో అప్పటికప్పుడు దరఖాస్తుల గడువు ఆగస్టు 29వ తేదీ వరకు పొడిగించారు. తీరా రెండో సారి గడువు ఇచ్చినా దరఖాస్తుదారులు పెద్దగా రాలేదు. దీంతో గత నెల 30న బార్లకు డ్రా తీయగా అధికారులు షాక్ తిన్నారు. కాకినాడ జిల్లాలో మొత్తం 17 బార్లకు నోటిఫికేషన్ ఇస్తే కేవలం ఐదు బార్లకు మాత్రమే నాలుగు చొప్పున దరఖాస్తులు రాగా వాటిని వ్యాపారులకు కేటాయించారు. కోనసీమ జిల్లాలో 11 బార్లకు నోటిఫికేషన్ జారీ చేయగా ఒక బారుకు మాత్రమే దరఖాస్తులు రావడంతో కేటాయించారు. తూర్పుగోదావరి జిల్లాలో 25 బార్లకు కేవలం 9 బార్లకు మాత్రమే లైసెన్స్‌లు కేటాయించారు. ఒకరకంగా చెప్పాలంటే ఉమ్మడి జిల్లాలో మొత్తం 53 బార్లకు డ్రా తీయాల్సి ఉంటే కేవలం 15 మాత్రమే డ్రా పూర్తి చేసుకున్నాయి.మిగిలిన బార్లకు చేసేదిలేక రద్దు చేశారు.

38 బార్లకూ..రెండో సారీ..!

మిగిలిన 38 బార్లకు తిరిగి డ్రా తీయడం కోసం ఎక్సైజ్ శాఖ ఈ నెల 3న మళ్లీ రెండోసారి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. వ్యాపారులంతా దరఖాస్తులు చేసుకోవాలని కోరింది. ఈ నెల 14న సాయంత్రం 6 గంటల వరకు వ్యాపారులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. కాకినాడ జిల్లాలో 12 బార్లు, కోనసీమ జిల్లాలో 10, తూర్పుగోదావరిలో 16 బార్లకు ఈ నెల 14లోపు దరఖాస్తులు రావాల్సి ఉంది. 15న లాటరీ నిర్వహిస్తారు. తొలి విడత స్పందన లేని నేపథ్యంలో మలివిడత అన్ని బార్లకు దరఖాస్తులు వచ్చేలా చూడాలంటూ ఉన్నతాధికారులు ఎక్సైజ్ అధికారులపై తెగ ఒత్తిడి తెస్తున్నారు.దీంతో ఇప్పుడు జిల్లాల్లో ఎక్సైజ్ అధికారులు తలలుపట్టుకుంటున్నారు.

నేడు ఎక్సయిజ్ శాఖ డీసీ రాక

ఎక్సైజ్ శాఖ డీసీ మంగళవారం కాకినాడ వస్తున్నారు.మూడు జిల్లాల ఎక్సైజ్ అధికారులతో సమావేశం ఏర్పాటుచేశారు. దీనికి అధికారులు సమాయత్తం అవుతుండగా.. తమ గోడు వినిపించుకోడానికి వ్యాపారులు ఎదురు చూస్తున్నారు. మొదటి నోటిఫికేషన్‌కి దరఖాస్తుల విషయంలో కోనసీమ జిల్లా ఎక్సైజ్ అధికారిపై వేటు పడగా, తూర్పు గోదావరి త్రుటిలో తప్పించుకొంది. కాకినాడ కాస్త పర్వాలేదని అనిపించింది. అయితే ఇప్పటికే కొన్ని బార్‌లు కేటాయింపు జరగడంతో నిబంధనల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ మార్పులు ఉండే అవకాశం లేదు. అధికారులు ప్రైవేటు షాపుల దరఖాస్తులదారులకు మెసేజ్‌లు పంపుతున్నా పరిస్థితుల్లో మార్పు కానరావడం లేదు. బార్ పాలసీ వల్ల గతం కంటే మెరుగైన లాభాలు వస్తాయని ప్రభుత్వం చెబుతున్నా.ఆ అంశాన్ని క్షేత్రస్థాయిలోకి ఎక్సయిజ్ అధికారులు తీసుకెళ్లలేకపోతున్నారనే వాదన వినవస్తోంది.

మున్సిపోల్స్ సందడి

- మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై అధికారుల దృష్టి
- వచ్చేనెలలో వార్డుల విభజన
- రిజర్వేషన్ల ఎంపిక ప్రక్రియ పూర్తికి సన్నాహాలు
- మున్సిపాలిటీల్లో గ్రామాల విలీనానికి మరోసారి బ్రేక్?
- వైసీపీ అధీనంలో ఉన్న మున్సిపాలిటీల కైవసానికి కూటమి వ్యూహం
- రాజకీయంగా వేడెక్కిస్తున్న ఎన్నికల కమిషన్ ఆదేశాలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)
రాష్ట్రంలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి స్టేట్ ఎలక్షన్ కమిషన్ ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది. రాజకీయపరంగా వాతావరణం క్రమంగా వేడెక్కుతోంది.

అక్టోబరు 15నాటికి ఖరారు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మూడు మున్సిపాలిటీలు, ఒక నగర పంచాయతీకి సంబంధించి వచ్చే ఏడాది జనవరిలోగా ఎన్నికల నిర్వహణలోభాగంగా ఆయా వార్డుల పునర్విభజన, రిజర్వేషన్‌పై మున్సిపల్ అధికారులు దృష్టిసారించాల్సి ఉంది. దీనికి సంబంధించి వార్డులవారీగా ఓటర్ల జాబితా సవరణలతోపాటు వార్డుల పునర్విభజనకు సంబంధించిన సమాచార సేకరణపై మున్సిపల్ అధికారులు దృష్టిసారిస్తున్నారు. అక్టోబరు 15నాటికి వార్డుల రిజర్వేషన్ల ప్రక్రియ ఖరారు చేసి స్టేట్ ఎలక్షన్ కమిషన్‌కి నివేదిక సమర్పించాల్సి ఉంది. మున్సిపాలిటీల్లో ఆయా సమీప గ్రామాల విలీన ప్రక్రియ ఏళ్ల తరబడి పెండింగ్ అంశంగానే మిగిలిపోతుంది. ఎన్నికలకు ముందు తెరపైకి వస్తున్న మున్సిపల్ పరిధిలోని సమీప గ్రామాల విలీన ప్రక్రియ సమస్య వస్తున్నప్పటికీ న్యాయపరమైన చిక్కులు, ఇతర సమస్యలతో ఆ ప్రతిపాదనను పక్కన పెట్టేస్తున్నారు. దీనిలోభాగంగా అమలాపురం పురపాలక సంఘ పరిధిని ఆనుకునిఉన్న ఈదరపల్లి గ్రామ పంచాయతీని ప్రస్తుతం మున్సిపాలిటీలో విలీనం చేయాలని ప్రతిపాదనలు ఎన్నికలకు ముందు చర్చకు వస్తున్నప్పటికీ అవి ఆచరణ సాధ్యం కావడంలేదు. ఈదరపల్లి పంచాయతీని మున్సిపాలిటీలో విలీనం చేస్తే పట్టణానికి ఆదాయ వనరులు పెరగడంతోపాటు వార్డుల సంఖ్య అనూహ్యంగా పెరిగే అవకాశంఉంది. ఆర్టీసీ కాంప్లెక్స్‌తో సహా ఇతర కీలక ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు, ఈదరపల్లి పరిధిలో ఉండడంతో వాటిని విలీనం చేయడానికి ప్రస్తుత సమయం సరిపోకపోవచ్చునని భావిస్తున్నారు.

నవంబరు 15లోగా ఓటర్ల జాబితా..

జిల్లాలో ఉన్న మూడు మున్సిపాలిటీల్లో అమలాపురం, రామచంద్రపురం మున్సిపాలిటీలో ప్రస్తుతం వైసీపీ కౌన్సిల్ అధీనంలో ఉన్నాయి. మండపేట టీడీపీ, ముమ్మిడివరం నగర పంచాయతీ వైసీపీ కౌన్సిల్ ఆధ్వర్యంలో ప్రస్తుతం ఉన్నాయి. జిల్లాలో మెజార్టీ మున్సిపాలిటీలు వైసీపీ కౌన్సిల్ హయాంలో ఉండడంతో ఈసారి వాటన్నింటినీ తెలుగుదేశం, జనసేన ఖాతాలోకి వేసుకునేందుకు ఆ పార్టీ శ్రేణులు వ్యూహరచన చేస్తున్నారు. దీనిలోభాగంగా కొన్ని వార్డుల విభజనతోపాటు ఓటర్ల జాబితాల సవరణలో మెజార్టీ ఓటర్లను తమ అనుకూలులైన వారి ఓట్లు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు తెలిసింది. స్టేట్‌ఎలక్షన్ కమిషన్ ఇచ్చిన ఆదేశాల మేరకు అక్టోబరు 15లోగా వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ ప్రక్రియ పూర్తి చేసి నివేదికను ఎన్నికల కమిషన్‌కు పంపించాలి. అక్టోబరు 16 నుంచి నవంబరు 15లోగా ఓటర్ల జాబితాను ప్రచురించాలి. పోలింగ్ కేంద్రాల ఖరారు, ఈవీఎంలు సిద్ధం చేయడం వంటి ప్రక్రియలను నవంబరు 30వతేదీ నాటికి పూర్తిచేసి రిజర్వేషన్లను డిసెంబరు 15నాటికి ఖరారు చేయాలి. రాజకీయ పార్టీలతో డిసెంబరు చివరి వారంలోగా సమావేశాలు నిర్వహించి 2026, జనవరిలో విడుదల చేసే మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్‌ను అనుసరించి ఎన్నికల నిర్వహణకు మున్సిపాలిటీలు సిద్ధం కావాల్సి ఉంది. మూడు నెలల ముందుగానే మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించాల్సి రానుండడంతో అధికారులు అప్పుడే ఎన్నికల నిర్వహణ తీరుపై దృష్టిసారించాల్సి వచ్చింది. ఈసారి కచ్చితంగా మున్సిపాటీల్లో పాగా వేయాలనే ఆలోచనతో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి వ్యూహ రచనలు చేస్తున్నారు.

నేడు అమలాపురంలో మారథాన్ 5కే రన్

- హెచ్‌ఐవీపై అవగాహనకు భట్నవిల్లి నుంచి రోళ్లపాలెం జంక్షన్ వరకు రన్



మారథాన్ రన్ పోస్టర్, టీషర్టును ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన పెంచడానికి జాతీయ ఎయిడ్స్ నియంత్రణలో భాగంగా ఈనెల 9న 5కే మారథాన్ రన్ నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ లైంగికంగా సంక్రమించే ఇన్ఫెక్షన్లు, మాదకద్రవ్యాల దుర్వినియోగంపై జిల్లాస్థాయి మారథాన్ 5కే రన్ పోటీలను నిర్వహించడానికి నిర్ణయించామన్నారు. అమలాపురం రూరల్ మండలంలోని భట్నవిల్లి జంక్షన్ నుంచి రోళ్లపాలెం వరకు మంగళవారం ఉదయం 6 గంటల నుంచి గంటపాటు నిర్వహిస్తామని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు చెందిన 15 నుంచి 25ఏళ్లలోపు విద్యార్థులు పాల్గొనాలని సూచించారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన వారికి రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. జిల్లాలో గెలిచి మొదటిస్థానం పొందినవారికి రూ.10వేలు, రెండోస్థానం పొందిన వారికి రూ.7వేలు బహుమతులు ఇస్తామన్నారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా ఈ 5కే రన్ ఉంటుందని, జిల్లా క్రీడా అధికారి సహకారంతో నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా టీషర్టులు, బ్యానర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. డీఎంహెచ్‌వో ఎం.దుర్గారావుదొర, అదనపు డీఎంహెచ్‌వో భరతలక్ష్మి పాల్గొన్నారు.

'104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'


డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందిస్తున్న 104 ఉద్యోగులు

మామిడికుదురు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలంటూ జిల్లావైద్యశాఖ అధికారి దుర్గారావుదొరకు 104 ఉద్యోగులు వినతిపత్రం అందించారు. తగ్గించిన జీతాలు, బకాయిలతో సహా ఇప్పించాలని, నిత్యావసర సరుకులకు అనుగుణంగా ఉద్యోగుల వేతనాలుపెంచాలని, స్లాబ్‌సిస్టమ్ అమలుచేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులకు కాజువల్, ఎర్న్‌లీవులు, పబ్లిక్ హాలీడేలు అమలుచేయాలని, వాహనాలకు సరిపడా సిబ్బందిని నియమించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఎంహెచ్‌వోకు అందించారు.

జిల్లాలో భవిత కేంద్రాలకు అలవెన్సులు

- జిల్లా సహిత విద్య సమన్వయకర్త సత్యనారాయణ


గోడిలంక భవిత కేంద్రంలో జిల్లా సమన్వయకర్త సత్యనారాయణ

అల్లవరం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఎన్నడూ లేనివిధంగా అవకతవకలకు తావులేకుండా గవర్నమెంట్ అప్లికేషన్ లీప్ యాప్ ద్వారా భవితకేంద్రాల్లో అర్హులైన పిల్లలకు అలవెన్సుల ప్రక్రియ జరుగుతోందని జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. అల్లవరం మండలం గోడిలంక భవిత కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. విద్యాబోధనను, విద్యార్థులను పరిశీలించి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. భవిత కేంద్రంలో హాజరుపట్టీ రికార్డులు పరిశీలించి సంతృప్తి చెందారు. రాష్ట్రంనుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు వచ్చిన అలవెన్సులను వివరించారు. 834మంది బాలికలకు రూ.2వేల చొప్పున గర్ల్ స్టైఫండ్, 250మందికి రూ.3వేల చొప్పున హనీ బెస్ట్ అలవెన్సు, 279మందికి రూ.3వేల చొప్పున ఎస్కార్ట్ అలవెన్సు, 114మందికి రూ.6వేల చొప్పున ట్రాన్‌పోర్టు అలవెన్సులు ఇచ్చారన్నారు. జిల్లావ్యాప్తంగా అందరూ ప్రత్యేక ఉపాధ్యాయులు ఈ ప్రక్రియను పూర్తిచేశారన్నారు. రాష్ట్రస్థాయిలో మెడికల్ క్యాంపులు, అలవెన్సుల ప్రక్రియ పూర్తి చేసిన జిల్లాగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మొదటిస్థానంలో నిలిచిందని సత్యనారాయణ తెలిపారు. ప్రత్యేక ఉపాధ్యాయులు తంగెళ్ల శ్రీను, భవానీ పాల్గొన్నారు.

'పీజీఆర్ఎస్'కు 200 అర్జీలు


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్

అమలాపురంటౌన్,సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చినఅర్జీలు పునరావృతమైతే అందుకు జిల్లాఅధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని కలెక్టర్ మహేష్‌కుమార్ హెచ్చరించారు. ప్రజలకు చేరువగా సుపరిపాలనను అందించాలనే లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం వివిధస్థాయిల్లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలను ఏర్పాటు చేసిందన్నారు. అర్జీలకు పరిష్కారం చూపడంలో జిల్లాఅధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. జేసీ టి.నిషాంతి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి నిర్దేశించిన గడువులోగా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్,జేసీలతో కలిసి డీఆర్వో మాధవి, డ్వామా పీడీ మధుసూదన్, ఎస్‌డీసీ కృష్ణమూర్తి, డీఎల్డీవో రాజేశ్వరరావు 200అర్జీలను స్వీకరించారు.

జిల్లా ఎస్పీకి 23 అర్జీలు

అమలాపురంటౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి):జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కారవేదికకార్యక్రమం ఎస్పీ కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలను ఎస్పీ నేరుగా అడిగి తెలుసుకుని అర్జీలను స్వీకరించారు. కుటుంబకలహాలు, భూతగాదాలు, ఇతర సమస్యలపై 23అర్జీలను ఎస్పీ స్వీకరించారు. పోలీసుఅధికారులతో మాట్లాడి చట్టపరిధిలో సమస్యలను విచారించి త్వరగా పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని ఎస్పీ కృష్ణారావు ఆదేశించారు.

వినియోగదారుల రక్షణ మండలి సమావేశం

- వారి హక్కులను పరిరక్షించాలి: జేసీ

అమలాపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హక్కులపట్ల పూర్తిస్థాయిలో అవగాహనతోపాటు వారికి రక్షణ కల్పిస్తూ ఫిర్యాదుల సంస్కృతిని ప్రోత్సహించకుండా నియంత్రించాలని జేసీ నిషాంతి సూచించారు. అమలాపురంలోని కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యులతో సమావేశం నిర్వహించారు.వినియోగదారుల హక్కుల పరిరక్షణలో సభ్యులు కీలకంగా పనిచేయాలని జేసీ సూచించారు. ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది లోఓల్టేజ్ సమస్యను పరిష్కరించేందుకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని, లైన్‌మెన్లను నియమించాలని సూచించారు. తాత్కాలిక లైన్‌మెన్ల వల్ల ప్రమాదాల బారినపడి నష్టపోతున్నారని తెలిపారు. పీఎం జనౌషధి, జనరిక్ మెడిసిన్‌లు ఒకేరకమైన ఔషధ గుణాలు కలిగి ఉంటాయని, వినియోగదారులకు ఆర్థికభారం తగ్గించేలా జనరిక్ మందులను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ చట్ట నిబంధనను అతిక్రమించి అనధికారంగా వ్యాపారాలు చేసే వారిపై ప్రజాప్రాతినిథ్య చట్టం ప్రకారం కేసులు బనాయిస్తామని హెచ్చరించారు. గ్యాస్ కంపెనీ సిబ్బంది వినియోగదారులనుంచి అధికంగా డబ్బులు వసూలు చేయకుండా చూడాలన్నారు. వివిధ సంస్థలవద్ద రేట్ల పట్టికలను ప్రదర్శించేలాచర్యలు తీసుకోవాలని వినియోగదారుల హక్కుల పరిరక్షణ విషయంలో రాజీలేకుండా సభ్యులు కృషిచేయాలని విజ్ఞప్తిచేశారు. ఈ సందర్భంగా జరిగిన వినియోగదారుల మండలి సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్, సివిల్ సప్లయిస్ మేనేజర్ శ్రీనివాస్, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.4కోట్లతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం


గుడిమూలలో సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

అంతర్వేది,సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లేనిదే ఏ కార్యకలాపాలు జరగడం లేదని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఐదు గ్రామాల్లో లోఓల్టేజ్ సమస్యల విముక్తి, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నామని, గుడిమూల నూతన సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే దేవ అన్నారు. సఖినేటిపల్లి మండలం గుడిమూలలో 33/11 కేవీ నూతన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ముందుగా ఆయనకు విద్యుత్ ఎస్‌ఈ రాజేశ్వరి, కూటమి నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం విద్యుత్ సబ్‌స్టేషన్ స్విచ్‌లను, నూతన సబ్‌స్టేషన్ స్విచ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ ప్రతి గ్రామానికి తాగునీరు, ఇంటి అవసరాలు, ఆక్వారంగం నిర్వహణ వంటివి ముందుకు నడవాలంటే విద్యుత్ ఎంతో అవసరమని, అటువంటి విద్యుత్ సబ్‌స్టేషన్లను గుడిమూల గ్రామంలో ఏర్పాటు చేయడం సంతోషకరమని అన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా గత 15 నెలల్లో రూ.40కోట్ల విద్యుత్ మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. గుడిమూలలోనే రూ.4 కోట్లతో 4నెలల్లోనే పూర్తిచేసి ఈ రోజుప్రారంభించామన్నారు. ముందుగా సర్పంచ్ దెందుకూరి శ్రీహరిరాజు అధ్యక్షతన ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఎమ్మెల్యే దేవను విద్యుత్ అధికారులు, సర్పంచ్, గ్రామస్తులు ఘనంగా సన్మానించి సత్కరించారు. ఎస్‌ఈ రాజేశ్వరి మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో రాజోలు నియోజకవర్గంలో మరిన్ని విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, చిటికెల రామ్మోహనరావు, గుబ్బల శ్రీనివాస్, పినిశెట్టి బుజ్జి, ఆకన బాబ్జినాయుడు, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, చాగంటి స్వామి పాల్గొన్నారు.

చక్కనయ్యా.. చందమామ!



చందమామ మాయమైపోయాడు.. చక్కనయ్యా చందమామ ఎక్కడున్నావో అన్నా.. చందమామ రావె.. జాబిల్లి రావె.. అన్నా ఆదివారం రాత్రి కనిపించలేదు.. చంద్ర గ్రహణం కావడంతో మబ్బుల చాటున దాక్కున్నాడు.. చివరికి గ్రహణం విడుపు సమయం సోమవారం తెల్లవారు జామున ఇలా చందమామ బయటపడ్డాడు.. తొలుత అర్ధచంద్రా కారంలో కనిపించి మెల్లమెల్లగా తెల్లారేసరికి ఇలా చందమామ కనిపించాడు.. తెల్లవారుజామున నిండు చంద్రుడిని ఆనందంగా తిలకించారు.

- ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం



నిండు గోదారి

ధవళేశ్వరం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గోదావరి నిండుగా ప్రవహిస్తూనే ఉంది. గత 15 రోజులుగా గోదావరి వరద పెరిగింది. నిలకడగా కొనసాగుతుంది. సోమవారం సాయంత్రానికి ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ గేట్లను ఒక మీటరు మేర ఎత్తి 4,55,627 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 9.20 అడుగులుగా నమోదైంది. వ్యవసాయ అవసరాల నిమిత్తం డెల్టా కాలువకు 14 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టాకు 4900 క్యూసెక్కులు, సెంట్రల్ డెల్టాకు 2100 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 7 వేల క్యూసెక్కులు చొప్పున విడుదలవుతున్నాయి.భద్రాచలం వద్ద నీటిమట్టం 26 అడుగులుగా నమోదైంది.



వైరం మరచి..

కొత్తపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కలిసి ఉంటే కలదు సుఖం.. ఇది అక్షరాలా నిజం.. ఈ చిత్రమే అందుకు ఉదాహరణ. పిల్లి కుక్కకు ఎక్కడైనా పడుతుందా.. కనిపిస్తే చాలు కొట్టుకుంటాయ్.. అయితే ఈ చిత్రంలో చూడండి.. కుక్కపై పిల్లి ఎంత దర్జాగా పడుకుందో.. ఎందుకంటే జాతి వైరం మరచి స్నేహం చేస్తుంది. జాతివైరాన్ని మరిచి ఒక పిల్లి పిల్లను అక్కును చేర్చుకుంది శునకం.తన పొట్టపైనా పడుకున్నా ఏమనకుండా అలాగే ఉండిపోయింది. కొత్తపేట రామాలయం వీధిలో పిల్లి తల్లి రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది..ఆ పిల్లి పిల్లలు రోడ్డున పడ్డాయి.. నాటి నుంచి ఆ పిల్లి పిలల్లను ఆదరిస్తూ అక్కున చేర్చుకుంటుంది శునకం. ఎవరూ ఆ పిల్లి పిల్లల వద్దకు రాకుండా కాపాడుకుంటోంది. ఆ పిల్లి పిల్లలకు అమ్మగా మారిపోయింది..





అమలాపురంలో ప్రత్యేక కేంద్రం

ఆపరేషన్.. డాగ్స్!

కుక్కల నియంత్రణకో కేంద్రం

- కుక్కల నియంత్రణకు కోర్టు ఆదేశాలు
- వీధి కుక్కలకు కు.ని ఆపరేషన్లు
- అమలాపురంలో ప్రత్యేక భవనం

అమలాపురం టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎటు చూసినా..ఎక్కడ చూసినా కుక్కల గుంపులే.. కొత్తగా ఏదైనా వీధిలో అడుగు పెట్టాలంటే ఏ కుక్క వచ్చి మీద పడుతుందోనని భయం.. అంతలా కుక్కల సంఖ్య పెరిగిపోయిం ది. అక్కడక్కడా దాడులు పెరిగాయి. ఏకంగా దేశ రాజధాని ఢిల్లీలో అయితే వరుసగా జరిగిన కుక్కల దాడులతో దేశ అత్యున్నత న్యాయస్థానం కల్పించుకుని తీర్పు చెప్పాల్సిన పరిస్థితి దాపురించింది. తొలుత ఢిల్లీకి మాత్రమే పరిమితమైన తీర్పును సవరణ చేస్తూ త్రిసభ్య ధర్మాసనం దేశ మంతటికీ వర్తించేలా ప్రకటించింది. కుక్కలన్నింటికీ స్టెరిలైజేషన్ (పిల్లలు పుట్టకుండా నియంత్రణ ఆపరేషన్లు) చేయించాలని పేర్కొంది. శస్త్రచికిత్స అనంతరం వాటిని ఎక్కడి నుంచి తీసుకువచ్చారో తిరిగి అక్కడే విడిచి పెట్టాలని ఆదేశించింది. రేబిస్ వ్యాధులు, విపరీత ప్రవర్తన ఉన్న కుక్కలను మాత్రం స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ అనంతరం ప్రత్యేక షెల్టర్లకు తరలించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నేపథ్యంలో అమలాపురం హిందూ శ్మశానాటిక సమీపంలో పశుజనన నియంత్రణ (ఏబీసీ), యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ కేంద్రం(ఏఆర్వీ) ప్రత్యేకంగా నిర్మించారు.ఆ కేంద్రంలో ప్రత్యేక వైద్య నిపుణుల బృందం పర్యవేక్షణలో సిబ్బంది కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడం ప్రారంభించారు. ప్రతీ కుక్కకు షెల్టర్లు నిర్మించి అందులోనే ఆహారం, నీరు అందిస్తున్నారు. వాటి ఆరోగ్యం కుదుట పడగానే తిరిగి ఎక్కడ నుంచి తెచ్చారో అక్కడే విడిచిపెడుతున్నామని మునిసిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ తెలిపారు.

అమలాపురం పురపాలక సంఘంలో కుక్కల నియంత్రణకు సంబంధించి పశుజనన నియంత్రణ (ఏబీసీ) భవనాన్ని ప్రత్యేకంగా నిర్మించారు. ప్రత్యేక వైద్య సిబ్బందితో పాటు కమిషనర్ నిర్మల్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య బృందాన్ని నియమించారు. కుక్కలను పట్టుకునేందుకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసుకున్నారు. ఏ రోజుకారోజు కుక్కలను పట్టుకుని పశుజనన నియంత్రణ కేంద్రానికి ఆ సిబ్బంది తరలిస్తారు. వైద్యులు ఆపరేషన్ చేయడంతో పాటు అవసరమైన కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అందిస్తున్నారు.రెండు రోజులుగా 54 వీధికుక్కలకు పశుజనన నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించినట్టు కమిషనర్ నిర్మల్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం పట్టణంలో ఉన్న వీధి కుక్కలన్నింటికీ పశుజనన నియంత్రణ ఆపరేషన్లు చేసే దిశగా చర్యలు చేపట్టామని వివరించారు.

సుప్రీం తీర్పు..

సుప్రీం కోర్టు తీర్పును కొందరు సమర్థించగా మరికొందరు వ్యతిరేకించారు. పర్యావరణ సమతుల్యతను పరిగణలోనికి తీసుకోకుండా తీర్పు ఇస్తారా అని ప్రశ్నించినవారు ఉన్నారు. ఈ నేపథ్యంలో దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో జరిగిన కుక్కల దాడుల ఘటనలను సోషల్ మీడియాలో విస్తృతంగా ఎందరో వైరల్ చేశారు. అటువంటి కుక్కలను తీసుకువెళ్లి నియంత్రణకు చేపట్టిన చర్యలను వ్యతిరేకించిన వారి ఇళ్ల వద్ద వదిలేయాలని పోస్టింగ్‌లు సైతం పెట్టారు.

రోడ్ల పక్కన ఆహారం నేరం



ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు వీధి కుక్కలకు బహిరంగ ప్రదేశాల్లో ఆహారం పెట్టడం నేరం. ఉల్లంఘించి ఆహారం పెడితే శిక్షణ తప్పదని సైతం హెచ్చరించారు. కుక్కలకు ఆహారం అందించడానికి ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వీధుల్లో కుక్కలకు అన్నం పెట్టినవారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వీధి కుక్కలను జంతు ప్రేమికులు దత్తత తీసుకోవచ్చునన్నారు.

వీధికుక్కల నియంత్రణకు చర్యలేవి?

వీధి కుక్కల నియంత్రణకు సంబంధించి గతంలోనే ప్రభుత్వాలు జీవోల ఇచ్చాయి. వాటిని అమలుచేసిన అధికారులు లేరు. పట్టించుకున్న పాలకులు లేరు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో కుక్కల బెడద విపరీతంగా పెరిగిపోయింది. గ్రామ సర్పంచ్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన కమిటీలు ఏమీ చేయకపోవడం వల్ల గ్రామాల్లో కుక్కల బెడద పెరిగిపోయిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీధికుక్కల నియంత్రణలో భాగంగా వాటిని పట్టుకోవడం, సురక్షిత పద్ధతుల్లో ఆపరేషన్లు చేయడం దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి ఎన్నో పనులు చేయాల్సిన కమిటీలు నేడు జాడ లేకుండా పోయాయి.

హిజ్రాలకు ఉచిత శిక్షణ



రాజమహేంద్రవరం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలు, నైపుణ్యాభివృద్ధిలో హిజ్రాలకు ఉచిత శిక్షణ అందించడానికి ట్వెంటీ ఫస్ట్ సెంచరీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ ముందుకు వచ్చిందని హిజ్రాలు, వయో వృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సహాయ సంచాలకులు శ్రీనివాస్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉద్యోగాలు సాధించడానికి, ఐటీ, ఐటీఈఎస్ రంగాల్లో ఉపాధి అవకాశాలకు శిక్షణ ఇవ్వడం ముఖ్యోద్దేశమన్నారు. తూర్పు, కాకినాడ, కోనసీమ జిల్లాల్లోని ఇంటర్, డిగ్రీ విద్యార్హత కలిగిన హిజ్రాలు తమ దరఖాస్తులను కాకినాడలోని తమ కార్యాలయంలో అందజేయాలన్నారు. మరింత సమాచారం కోసం 0884-2352303 నెంబరులో పనివేళల్లో సంప్రదించాలని ఆయన సూచించారు.



యూరియా కావాలయ్యా!

అధికారులేమో యూరియా కొరత లేదంటారు.. రైతులు చూస్తే యూరియా కావాలంటూ క్యూలు కడతారు.. ఇచ్చింది చాలక మళ్లీ మళ్లీ కావాలంటున్నారు. గొల్లప్రోలులో సోమవారం రైతులు ఇలా బారులు తీరారు. - గొల్లప్రోలు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలిలో జగన్మోహినీకేశవస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



కాకినాడ జిల్లా సామర్లకోటలో ప్రత్యేక అలంకరణలో భీమేశ్వరస్వామి



కాకినాడ జిల్లా అన్నవరంలో ఆలయ సంప్రోక్షణ అనంతరం సత్యదేవుని దర్శించుకుని వస్తున్న భక్తులు

గ్రహణం వీడి... గుడులు తెరుచుకుని

- చంద్రగ్రహణం అనంతరం సంప్రోక్షణ చేసి ఆలయాలను తెరిచిన అర్చకులు
- స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న భక్తులు

సామర్లకోట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రముఖ పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వర ఆలయాన్ని చంద్ర గ్రహణం విడుపు అనంతరం సోమవారం ఉదయం తెరిచి సంప్రోక్షణ చేశారు. భీమేశ్వరస్వామికి పంచద్రవ్యాలతో అభిషేకం, స్వామివారికి, బాలాత్రిపురసుందరి అమ్మవార్లకు విశేష పుష్పార్చన చేసినట్టు ఈవో బళ్ళ నీలకంఠం తెలిపారు. సుమారు 1,500 మంది అన్నప్రసాదం స్వీకరించారు. పురాతన మాండవ్యనారాయణస్వామి ఆలయం, హరిహర క్షేత్రం, అన్నపూర్ణా సమేత రామలింగేశ్వరా లయంలో వ్యవస్థాపకుడు పరమానందగిరి స్వామీజీ ఆధ్వర్యంలో ప్రధాన పండితుడు విశేష పూజలు చేశారు. గ్రహణం విడిచిన తర్వాత పట్టణంలోని అన్ని ఆలయాలు భక్తులతో కిక్కిరిసాయి.

అన్నవరం (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం మూతపడిన సత్యదేవుడి ఆలయం సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం తెరుచుకుంది. వేకువజామున మూడు గంటల నుంచి సిబ్బంది సంప్రోక్షణ చేపట్టారు. అనంతరం మూలవరులకు అర్చకస్వాములు ప్రత్యేక అలంకరణ చేశారు. ఉదయం ఏడు గంటల నుంచి సర్వ దర్శనాలు ప్రారంభం కాగా భక్తులు స్వామివారిని దర్శించుకుని పునీతులయ్యారు.

ఆత్రేయపురం (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి, ర్యాలి జగన్మోహినీకేశవస్వామి ఆలయాలను చంద్ర గ్రహణం సంపూర్తి అనంతరం సోమవారం ఉదయం తెరిచారు. అర్చకులు సంప్రోక్షణ చేసి పూజలు జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



ప్రొఫెసర్ ఏఎస్ఎన్ చక్రవర్తికి ఉత్తమ అధ్యాపక అవార్డు అందజేసి సత్కరిస్తున్న జేఎన్టీయూకే ఉప కులపతి ప్రసాద్

అభ్యసనకు అంతులేదు : జేఎన్టీయూకే వీసీ ప్రసాద్

జేఎన్టీయూకే, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అభ్యసనకు అంతులేదని, నిబద్ధత, క్రమశిక్షణ, నిరంతరం శ్రమించేతత్వం అధ్యాపకులకు ఎంతో అవసరమని కాకినాడ జేఎన్టీయూ ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ పేర్కొన్నారు. వర్శిటీలోని యూసీఈకే సివిల్ ఇంజనీరింగ్ విభాగం సెమినార్ హాల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని సోమవారం జేఎన్టీయూకే, యూసీఈకే అధ్యాపక సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ వి.శ్రీనివాసులు అధ్యక్షతన గురుపూజోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీసీ ప్రసాద్, అతిథులుగా ప్రిన్సిపాల్ మోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్స్ దీక్షితులు, స్వరూపారాణి హాజరై సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. వీసీ మాట్లాడుతూ అధ్యాపకులు ఎల్లప్పుడూ నైతిక విలువలు పాటిస్తూ సమాజ ఉన్నతికి తోడ్పడాలన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికైన ఏఎస్ఎన్ చక్రవర్తి, ఎస్.సత్యవేణి, కె.రవీంద్ర, డి.కోటేశ్వర రావు, బి.లీలాకుమారి, టి.లక్ష్మణకిషోర్‌లను వీసీ, అతిథులు సత్కరించారు. కార్యక్రమంలో జేఎన్టీయూకే డైరెక్టర్లు, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే భారత రాజ్యాంగ పరిరక్షణ

- ఎస్సీ వర్గీకరణను చంద్రబాబు వెనక్కి తీసుకోవాలి
- కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

కాకినాడ సిటీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే భారత రాజ్యాంగ పరిరక్షణ జరుగుతుందని సీడబ్ల్యూసీ సభ్యుడు, కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ పేర్కొన్నారు. కాకినాడలోని ఓ హోటల్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం కాంగ్రెస్‌కు అండగా ఉన్న దళితులను విభజించేందుకు టీడీపీ ఆనాడే వ్యూహం పన్నిందన్నారు. కేసీఆర్ వెనుక మాదిగలు రాజ్యాధికారం దిశగా ఉండడంతో రాష్ట్ర విభజన జరిగిందన్నారు. ఇప్పుడు దళితుల మధ్య వివాదాలకు కారణమవుతున్న ఎస్సీ వర్గీకరణను చంద్రబాబు వెనక్కి తీసుకోవాలన్నారు. వైఎస్సార్ మరణం తర్వాత తెలంగాణకు చెందిన దామోదర రాజనరసింహకు సీఎం పదవి కట్టబెడితే ఆంధ్ర రాష్ట్ర విభజన జరిగేది కాదన్నారు. రాజ్యాంగ పరిరక్షణ దిశగా కుప్పం నుంచి దళితుల పాదయాత్ర జరుగుతోందన్నారు. ప్రధానిగా మోదీ 11 ఏళ్లుగా కొనసాగుతున్నారని, 2029 వరకు ఆ పదవిలో ఉంటారనే నమ్మకం తనకు లేదన్నారు. ఆయిల్ కొనుగోలులో మోదీ ప్రభుత్వం భారీ కుంభకోణానికి పాల్పడుతోందన్నారు. బ్యాంకుల నుంచి రూ.14.5 లక్షల కోట్ల రుణమాఫీ విషయంలో బీజేపీ తీవ్ర అవినీతికి పాల్పడిందన్నారు. రాష్ట్రంలో వాట్సాప్ పాలన కాకుండా వాటాల



పాలన సాగుతోందన్నారు. అమరావతిలో 70వేల ఎకరాలను రైతుల నుంచి బలవంతంగా సేకరించి పారిశ్రామికవేత్తలకు చౌకగా కట్టబెడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం కేవలం మోదీ, అమిత్‌షా భజన చేయడానికే పనిచేస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో సానుభూతి పెరుగుతోందని, బయటకు వెళ్లిన నాయకులంతా తిరిగి వస్తారన్నారు.



శ్రీనివాస్‌కు పాదగయ క్షేత్ర ప్రాశస్త్యం వివరిస్తున్న వేద పండితుడు

పాదగయలో దక్షిణ మధ్య రైల్వే చీఫ్ వర్క్స్ మేనేజరు పూజలు

పిఠాపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రానికి దక్షిణ మధ్య రైల్వే చీఫ్ వర్క్స్ మేనేజరు ఎస్.శ్రీనివాస్ సోమవారం విచ్చేశారు. కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. వేదపండితులు క్షేత్ర ప్రాశస్త్యాన్ని వివరించి ఆశీర్వచనం పలికారు. ఆలయ అధికారులు శ్రీనివాస్‌ను శేష వస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట సామర్లకోట రైల్వేస్టేషన్ మేనేజరు ఎం.రమేష్, సీనియర్ సెక్షన్ ఇంజనీర్లు సీహెచ్ శ్రీనివాస్, ఎం.రవికృష్ణ వున్నారు.



భీమేశ్వరుని సేవలో తెలంగాణ సీఎస్

ద్రాక్షారామ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామలోని భీమేశ్వరాలయానికి సోమవారం తెలంగాణ చీఫ్ సెక్రటరీ సోమేష్‌కుమార్ విచ్చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. భీమేశ్వరస్వామిని, మాణిక్యాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నంది మండపంలో వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. దాత మీనవల్లి వెంకటశ్రీనివాస్ ఉన్నారు.

భీమేశ్వరాలయానికి కోస్టుగార్డ్ డీఐజీ రాజేష్‌మిట్టల్ విచ్చేశారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆయనకు నంది మండపంలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు.




శిక్షణ తరగతుల ప్రారంభ సభలో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ రమణ

'నూతన ఎంపీడీవోలు పరిపాలనాపరంగా మరింత నైపుణ్యం కలిగి ఉండాలి'

సామర్లకోట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎంపికైన ఎంపీడీవోలు పరిపాలనాపరంగా మరింత నైపుణ్యం కలిగి ఉండాలని భావించి ప్రభుత్వం నిర్వహిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ పేర్కొన్నారు. నూతన ఎంపీడీవోలు 46 మందికి సోమవారం నుంచి నెల పాటు జరిగే శిక్షణ తరగతులు ఇక్కడ సోమవారం ప్రారంభమయ్యాయి. వీరికి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు చెందిన కార్యక్రమాలు, గ్రామ పంచాయతీ, మండల పరిషత్ పరిపాలన, అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమగ్ర శిక్షణ ఇస్తారు. ముఖ్య అతిథిగా హాజరైన వైస్ ప్రిన్సిపాల్ రమణ మాట్లాడుతూ శిక్షణకు ముందు, శిక్షణ అనంతరం పరిపాలన నైపుణ్యాలను మరింత పెంచుకునేలా శ్రద్ధ, క్రమశిక్షణతో నేర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్‌రహిత స్టీలు మంచినీటి సీసాలను శిక్షణార్థులకు పంపిణీ చేశారు. డీడీవో శ్రీనివాసశర్మ, ఫ్యాకల్టీ జి.సుశీల, శేషుబాబు, చక్రపాణిరావు పలు అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణార్థులకు విస్తరణ శిక్షణ కేంద్రం ఆవరణలోనే రెసిడెన్షియల్ పద్ధతిలో వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నామని రమణ చెప్పారు.

ఆకాశం రంగుల మయం



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం కొత్తూరు వద్ద సాయంత్రం ఆకాశం ఎరుపెక్కి ఇలా కనిపించింది. ఆలమూరు, ఆంధ్రజ్యోతి



యానాం గౌతమి గోదావరి నది ఒడ్డున సూర్యాస్తమయం వేళ ఆకాశం పసుపుమయమైంది. యానాం, ఆంధ్రజ్యోతి

లారీ డ్రైవర్‌పై దాడి నగదు దోపిడీ

దివాన్‌చెరువు హైవేపై ఘటన

దివాన్‌చెరువు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు పెట్రోలు బంకు వద్ద జాతీయ రహదారిపై గుర్తుతెలియని వ్యక్తులు లారీ డ్రైవర్‌ను కొట్టి నగదు దోచుకుపోయిన సంఘటన సోమవారం తెల్లవారుజామున జరిగింది. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. రాజమహేంద్రవరం నుంచి సోలాపూర్ వెళ్తున్న లారీని డ్రైవర్ శ్రీషైన్‌మైత్రీ ఆదివారం అర్ధరాత్రి రెండుగంటల సమయంలో దివాన్‌చెరువు పెట్రోలు బంకు వద్ద రోడ్‌పక్కకు ఆపి డోర్ తెరచి క్యాబిన్‌లో పడుకున్నాడు. తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో బ్యాటరీ బైక్‌పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు నిద్రపోతున్న డ్రైవర్‌ను లేపి ఇష్టానుసారంగా కొట్టారు. అతడి జేబులో ఉన్న రూ.20 వేలు నగదుతో పాటు సెల్‌ఫోన్ తీసుకుని రాజానగరం వైపు పరారయ్యారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు బొమ్మూరు ఎస్‌ఐ ఆర్.అంకారావు తెలిపారు.

అర్ధరాత్రి హల్‌చల్...

మత్తులో పోలీసులపై యువకుల దాడి

రాజమహేంద్రవరంలో ఘటన



యువకుల దాడి దృశ్యాలు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జనాన్ని రక్షించే పోలీసులకు రక్షణ లేకుండా పోయింది. అందుకు నిదర్శనం ఈ సంఘటనే. మత్తులో యువకులు పోలీసులపై దాడి చేశారు. అసలేం జరిగిందంటే.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ యు.నాగరాజు, హోంగార్డు కేకేకేఎస్‌వీ ప్రసాద్ (కాళి) ఆదివారం రాత్రి నైట్‌బీట్ పహారాలో ఉన్నారు. రాత్రి 12గంటల సమయంలో కోటిపల్లి బస్టాండ్ సమీపంలోని సోనోవిజన్ సందులోకి వెళ్లగా.. అక్కడ ఓ చోట ముగ్గురు యువకులు పూటుగా తాగిన మత్తులో కనిపించారు. వాళ్లలో ఒక యువకుడు బీర్ తాగుతున్నాడు. దీంతో ఎవరు మీరు? ఇక్కడ ఈ టైంలో ఉండకూడదు? తాగేసి ఉన్నారు కదా? ఇళ్లకు వెళ్లిపోండి.. అని పోలీసులు అన్నారు. దీంతో ఆ యువకులు పోలీసులపై తిరగబడ్డారు. సుమారు 20 నిమిషాల పాటు కేకలు వేస్తూ, చేతులు విసురుతూ గలాటా సృష్టించారు. కాని స్టేబుల్ లాఠీని లాక్కున్ని కొట్టారు. యువకుల్లో ఒకడు తాను తాగే బీర్ బాటిల్‌తో తలపై కొట్టుకున్నాడు. చివరికి వాళ్లను అతికష్టంపై స్టేషన్‌కు తీసుకెళ్లారు. వాళ్లను పాత తుంగపాడుకు చెందిన కట్టుంగ హరీశ్, రాజవోలుకు చెందిన కర్రి దుర్గా సూర్య ప్రసన్న, ధవళేశ్వరం ఐవోసీఎల్ కాలనీకి చెందిన ములపర్తి వినోద్‌గా గుర్తించి కేసు నమోదు చేశారు. హరీశ్‌పై రాజానగరం పోలీస్ స్టేషన్లో రౌడీ షీటు ఉంది. హత్య, హత్యాయత్నం నేరాల్లో నిందితుడిగా ఉన్నాడు. అయితే వారు గంజాయి పూటుగా తాగిన మత్తులో పోలీసులపై దాడికి దిగారని తెలుస్తోంది.

అనుమతి మేరకే పొగాకు పండించాలి

బాడవ పొలాల్లో పంట వేయొద్దు : పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

దేవరపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పొగాకు బోర్డు ఇచ్చిన అనుమతి మేరకే పొగాకు పండించాలని పొగాకు బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్‌కుమార్ పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో పొగాకు వేలం కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించి అనంతరం పొగాకు బోర్డు కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యశ్వంత్‌కుమార్ మాట్లాడుతూ రైతులు స్వీయ నియంత్రణ పాటించాలన్నారు. ఈ ఏడాది పొగాకు పంటకు ప్రారంభంలో ధర రూ.240 ఉండగా క్రమంగా పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం కిలో ధర రూ.375 పలుకుతుందన్నారు. ఎన్‌ఎల్‌ఎస్ ఏరియాలో 42మిలియన్ కిలోల అనుమతి ఇవ్వగా అదనంగా 12మిలియన్ కిలోలు ఉత్పత్తి పెరిగిందన్నారు. అంతర్జాతీయంగా భారత దేశంలో పండించే పొగాకుకు గట్టి పోటీ ఉంటుందని ముఖ్యంగా జింబాబ్వే, బ్రెజిల్, ఆఫ్రికా వంటి దేశాల్లో పొగాకు ఉత్పత్తి పెరిగిందన్నారు. దాన్ని దృష్టిలో పెట్టుకుని పంట నియంత్రణ పాటించాలన్నారు. గతేడాది తుఫాన్ వల్ల రైతులు తీవ్రంగా పంట నష్టపోవడంతో రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి, ఏలూరు ఎంపీ పి.మహేశ్ సహకారంతో పొగాకు అదనపు పంటకు పెనాల్టీ లేకుండా వెసులుబాటు కల్పించిందన్నారు. ఈ ఏడాది అదనపు పంటకు పెనాల్టి 10-20శాతం వరకు ఉత్పత్తి అయిన పొగాకుకు 2-3శాతం పెనాల్టీ విధించినట్టు ఆయన తెలిపారు. తొర్రేడు రైతులు ఎన్‌ఎల్‌ఎస్‌కు బ్యారన్‌కు 35క్వింటాళ్లు అనుమతి ఇస్తున్నారని, తమకు 21 క్వింటాళ్లే అనుమతి ఇస్తున్నారని, అలాంటి వ్యత్యాసం లేకుండా చూడాలని చైర్మన్‌ను స్థానిక రైతులు కోరారు. ఆయన సానుకూలంగా స్పందించి పొగాకు బోర్డు సమావేశంలో చర్చించి న్యాయం చేస్తామన్నారు. బాడవ పొలాల్లో పొగాకు పంట వేయొద్దని, అలా వేస్తే బోర్డు చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు కొత్తగా బ్యారన్ లైసెన్సులు ఇవ్వాలని కోరగా ఈ విషయం తన పరిధిలో లేదని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ జీఆర్‌కే ప్రసాద్, దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి హేమస్మిత, పొగాకు బోర్డు రైతు సంఘం నాయకులు కరుటూరి శ్రీనివాస్, కేవీవీ సత్యనారాయణ, పరిమి శ్రీరామకృష్ణ, యాగంటి వెంకటేశ్వరరావు, సింహాద్రి ధర్మవతారం, నరహరశెట్టి రాజేంద్రబాబు, బిక్కిన నాగరాజు, నాయుడుదుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

స్కానింగ్ సెంటర్ సీజ్

పూర్తి విచారణ చేపట్టాలి : కాకినాడ కలెక్టర్

జీజీహెచ్ (కాకినాడ), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఓ స్కానింగ్ సెంటర్‌ను కాకినాడ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు సోమవారం సీజ్ చేశారు. కాకినాడలోని వెంకటేశ్వర స్కానింగ్ సెంటర్‌లో పీసీపీఅండ్‌డీటీ యాక్ట్‌కు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించట్లేదన్న ఆరోపణలపై విచారణ చేపట్టిన డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ బృందం ఆ నివేదికను కలెక్టర్ షాన్‌మోహన్‌కు సమర్పించింది. దాంతో ఆయన ఆదేశానుసారం ఆర్డీవో ఎస్.మల్లిబాబు సమక్షంలో స్కానింగ్ సెంటర్‌ను సీజ్ చేశారు. ఈ స్కానింగ్ సెంటర్‌ను 8 వారాలు సస్పెన్షన్ చేస్తూ ఎస్పీ బిందుమాధవ్ ఆధ్వర్యంలో పూర్తి విచారణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని స్కానింగ్ సెంటర్ల యాజమాన్యం పీసీపీఅండ్‌డీటీ యాక్ట్ ప్రకారం నమోదు చేసుకోకపోయినా, సరైన రికార్డులు నిర్వహించకపోయినా, ఫారం ఎఫ్ రిపోర్ట్‌లు డీఎంహెచ్‌వో కి పంపకపోయినా, లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించి ఆడ, మగ అని తెలిపినా పీసీపీఅండ్‌డీటీ యాక్ట్ నిబంధనలు అతిక్రమణగా పరిగణించి తగు చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో నరసింహనాయక్ తెలిపారు.

భర్తను హత్య చేసిన భార్య అరెస్ట్

అమలాపురం రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): భర్తను అతి కిరాతకంగా ఇనుపరాడ్‌తో తలపై మోది హత్య చేసిన భార్య దొమ్మేటి వెంకటరమణను సోమవారం అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచినట్టు తాలూకా ఎస్‌ఐ వై.శేఖర్‌బాబు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ నడిపూడి బైపాస్ రోడ్డులో మెట్ల రాంజీ కాలనీలో ఈనెల 4న అర్ధరాత్రి సమయంలో కాకినాడ హెడ్ క్వార్టర్స్ స్క్వాడ్‌లో ఆర్టీసీ బస్సుల తనిఖీ అధికారిగా పనిచేస్తున్న దొమ్మేటి రాంబాబు (61)ని కిరాతకంగా భార్య వెంకటరమణ హత్య చేసింది. దొమ్మేటి నాగసురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. భార్య వెంకటరమణను అరెస్టు చేసి సోమవారం రాత్రి కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మరణించిన సూర్యప్రకాష్

గొల్లప్రోలు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణ శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మరణించాడు. పట్టణానికి చెందిన సందిపు సూర్యప్రకాష్ (39) తన స్కూటీపై కాకినాడ బయలుదేరాడు. పట్టణ శివారులోని వెంకటేశ్వర రైస్‌మిల్లు వద్దకు వచ్చేసరికి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో రోడ్డుపై పడిపోయి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించాడు. గొల్లప్రోలు ఎస్‌ఐ ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఆటో ఢీకొని మహిళ మృతి

పిఠాపురం రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మరణించింది. గ్రామానికి చెందిన ముల్లుల్లి శేషారత్నం (60) రోడ్డు దాటుతుండగా కాకినాడ నుంచి పిఠాపురం వస్తున్న ఆటో ఢీకొని అక్కడికక్కడే మరణించింది. పిఠాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గొల్లప్రోలులో కూలిన ఇంటి పైకప్పు

తప్పిన ప్రమాదం

గొల్లప్రోలు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలులో ఇంటి పైకప్పు కూలిన సంఘటనలో పెను ప్రమాదం తప్పింది. పట్టణంలోని మార్కండేయపురానికి చెందిన రాపర్తి గనిరాజుకు చెందిన పెంకుటిల్లు పైకప్పు ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి నానిపోయింది. సోమవారం అకస్మాత్తుగా కూలిపోయింది. ఆ సమయంలో ఆ ప్రాంతంలో కుటుంబసభ్యులు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇంట్లో సామాన్లు పూర్తిగా పాడయ్యాయని గనిరాజు తెలిపాడు.

ఇదేం వైద్యం?

ఆసుపత్రి ముందు బాధితుల ఆందోళన

కొత్తపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఉప్పాడ తీర ప్రాంతంలో ప్రవేటు ఆసుపత్రికి సోమవారం మాయాపట్నంకు చెందిన శాంతిరాజు, పాత పంచాయతీ సమీపంలో నివాసం ఉండే వి వీరకమల్ వేర్వేరు ఇబ్బందులతో వైద్యం చేయించుకోవడానికి వెళ్లారు. వారికి రక్తపరీక్షలు చేయించారు. శాంతి రాజుకు మలేరియా పాజిటివ్, వీరకమల్‌కు మలేరియా పాజిటివ్, పచ్చకామెర్లని రిపోర్టు ఇచ్చారు. ఐదు రోజుల పాటు ఆసుపత్రిలో ఉండి చికిత్స పొందాలని, లేకుంటే చాలా ప్రమాదమని చెప్పడంతో హడలెత్తిపోయారు. వారిద్దరూ వేరే ఆసుపత్రికి వెళ్లగా రక్తపరీక్షలు చేసి వైరల్ జ్వరాలని, మందులు వాడితే సరిపోతుందని వైద్యులు తెలియజేశారు. దీంతో శాంతిరాజు, వీరకమల్ ముందు పరీక్షలు చేయించిన ఆసుపత్రికి చేరుకుని ఆందోళన చేపట్టారు. వైద్యుడిని గట్టిగా నిలదీశారు. తీరప్రాంతాల్లో ప్రవేటు ఆసుపత్రులు, రక్తపరీక్ష కేంద్రాలపై అధికారులు విచారణ నిర్వహించి చర్యలు చేపట్టాలని కోరారు.

ఆటోలు, బస్సుల్లో మహిళలే టార్గెట్

● చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి మహిళల అరెస్ట్ ● రూ.2 లక్షల నగదు, 106.5 గ్రాముల బంగారం స్వాధీనం

అన్నవరం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆటోలు, బస్సుల్లో ప్రయాణించే మహిళలే వారి టార్గెట్. వారితో ప్రయాణిస్తూ మాటలతో ఒకరు దృష్టి మరల్చుతారు మరొకరు చాకచాక్యంగా బ్యాగుల్లో విలువైన వస్తువులు, నగదు తస్కరిస్తారు. అలా చోరీలు చేస్తున్న ఇద్దరు మహిళలు అన్నవరం పోలీసులకు చిక్కారు. వివరాల్లోకి వెళితే తూర్పుగోదావరి జిల్లా గోకవరానికి చెందిన తొండ శాంతి (35), ఆవుల భూలక్ష్మి (38) తోడుదొంగలు. మహిళా ప్రయాణికులే టార్గెట్‌గా అన్నవరం, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, రౌతులపూడి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీలు చేశారు. 4 కేసుల్లో నిందితులుగా ఉన్న వారి కోసం పోలీసులు 3 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయగా అన్నవరం ఎస్‌ఐ హరిబాబుకు వచ్చిన సమాచారం మేరకు వారిని శంఖవరం కత్తిపూడిలో పట్టుకున్నట్టు ప్రత్తిపాడు సీఐ సూర్యఅప్పారావు తెలిపారు. వారి నుంచి రూ.2 లక్షల నగదు, 106.5 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన నేపథ్యంలో మహిళలు ప్రయాణంలో అప్రమత్తతో ఉండాలని కోరారు.



అన్నవరంలో వివరాలు వెల్లడిస్తున్న ప్రత్తిపాడు సీఐ

కొత్తకోటపాడులో ప్రబలిన డయేరియా



గ్రామంలో బాధితుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో

- నాలుగు కేసుల నమోదు
- వినాయకచవితి ప్రసాదంతో ఫుడ్ పాయిజనింగ్ : అధికారులు
- నియంత్రణలో పరిస్థితి : డీఎంఅండ్‌హెచ్‌వో

రంగంపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం కొత్త కోటపాడులో నాలుగు డయేరియా కేసులు నమోదు కావడంతో గ్రామస్థులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. సోమవారం డయేరియా కేసులు నమోదు కావడంతో విషయాన్ని డీఎంఅండ్‌హెచ్‌వోకి తెలియజేయడంతో వెంటనే డిప్యూటీ డీఎంహెచ్‌వో, జిల్లా సర్వేలెన్స్ అధికారి, ఎపిడెమియాలజిస్ట్, జిల్లా బృందం, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కొత్త కోటపాడు వచ్చి నమోదైన డయేరియా కేసులను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారు. రంగంపేట పీహెచ్‌సీ, ప్రత్యేక డాక్టర్ల బృందంతో మెడికల్ క్యాంప్ నిర్వహించి బాధితులకు చికిత్స అందించారు. ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, పర్యవేక్షక సిబ్బంది ఇళ్ల దగ్గరకు వెళ్లి కేసులపై విచారణ జరిపారు. అలాగే నీటి, మల నమూనాలను సేకరించి పరిశీలన కొనసాగుతుంది. పరిస్థితి నియంత్రణలో ఉందని డీఎంఅండ్‌హెచ్‌వో కె.వెంకటేశ్వరరావు తెలిపారు. వినాయక చవితి ప్రసాదం పులిహోర తినడంతో అది ఫుడ్‌పాయిజనింగ్ కారణంగానే డయేరియా వచ్చి ఉండవచ్చని వైద్యాధికారులు తెలిపారు. ఇదే నిజమైతే డయేరియా కేసులు ఇంకా పెరగొచ్చని గ్రామస్థులు భావిస్తున్నారు. అలాగే కొత్తకోటపాడు, పాత కోటపాడు గ్రామస్తులు కొత్త నాయకంపల్లిలో ఉన్న నూతినీటిని తాగుతారని తెలపడంతో ఆ నీటి నమూనాలను కూడా సేకరించారని తెలిపారు. గ్రామంలో కేసులు నమోదైన ఇళ్ల దగ్గర పరిసరాల్లో పరిశుభ్రత చర్యలు చేపట్టారు. ప్రజలకు డయేరియాపై ఆరోగ్య విద్యా కార్యక్రమం నిర్వహించారు. నాయకంపల్లిలో ఉన్న నుయ్యి కూడా అపరిశుభ్రంగా ఉందని కొందరు గ్రామస్తులు చెప్తున్నారు.

కాకినాడలో కారు బీభత్సం

అదుపు తప్పి దూసుకెళ్లడంతో ఇద్దరికి గాయాలు

కాకినాడ క్రైం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో సోమవారం ఓ కారు బీభత్సం సృష్టించింది. వివరాలిలా ఉన్నాయి. మురళీ అనే వ్యక్తికి సంబంధించిన కొత్త కారు స్థానిక ప్రతాప్‌నగర్ బిడ్జి నుంచి గాంధీనగర్ వైపు వస్తూ ఉండగా ప్రమాదవశాత్తు అదుపు తప్పింది. ఈ క్రమంలో రోడ్డుపక్కన ఉన్న చిన్న చిన్న షాపులు, పార్క్ చేసి ఉన్న ద్విచక్రవాహనాలపైకి దూసుకెళ్లింది. దీంతో రోడ్డు పక్కన వ్యాపారం చేస్తున్న తోపుడు బండ్ల సామానులన్ని చెల్లచెదురయ్యాయి. అదేవిధంగా అదే ప్రాంతానికి చెందిన పాలకూరి శ్రీనివాసరావు అనే 71 ఏళ్ల వృద్ధుడు, కడలి వెంకటనారాయణ గాయాల పాలయ్యారు. అది గమనించిన స్థానికులు క్షతగాత్రులను జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతున్నారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దెబ్బతిన్న కారు

వృద్ధురాలి కిడ్నాప్?

కత్తులతో బెదిరించి కారులో తీసుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు



మతిస్థిమితం లేని వృద్ధురాలు (ఫైల్)

చింతూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని వృద్ధురాలిని గుర్తుతెలియని వ్యక్తులు కారులో తీసుకెళ్లిపోయారు. అల్లూరి జిల్లా చింతూరుతో పాటు సమీప గ్రామాల్లో 12 ఏళ్లుగా ఓ వృద్ధురాలు సంచరిస్తూ జీవనం గడుపుతోంది. ఆకలి అవుతున్నపుడు హోటళ్ల వద్దకు వెళ్తుంటుంది. వారు ఓ ముద్ద అన్నం పెడుతుంటారు. కాగా ఇటీవల ఆమె చింతూరుకు పది కిలోమీటర్ల దూరంలో ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న తుమ్మల వెళ్లింది. ఆదివారం రాత్రి కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు కారులో వచ్చి వృద్ధురాలిని బంధించి తీసుకెళ్లినట్టు గ్రామస్తులు పేర్కొన్నారు. బంధించి కారులో ఎక్కిస్తుండగా అడ్డుకునే ప్రయత్నం చేశామని, కానీ ఆ గుర్తుతెలియని వ్యక్తులు తమను కత్తులతో బెదిరించడంతో చేసేదేమీ లేక మిన్నకుండి పోయామని వారు చెప్పారు.

రంపచోడవరం నూతన ఐటీడీఏ పీవో బాధ్యతల స్వీకరణ

రంపచోడవరం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఐటీడీఏ నూతన ప్రాజెక్టు అధికారి స్మరణ్‌రాజ్ సోమవారం ఏఎస్‌ఆర్ జిల్లా కేంద్రం పాడేరులో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఐటీడీఏ పీవోగా బాధ్యతలు నిర్వహించిన కట్టా సింహాచలం రిలీవ్ అయ్యారు. కాగా నూతన ఐటీడీఏ పీవో స్మరణరాజ్ సోమవారం పాడేరులో జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన పీవో స్మరణ్‌రాజ్ అక్కడే ఐటీడీఏ పీవో బాధ్యతలు స్వీకరించినట్టు అధికార వర్గాలు పేర్కొన్నాయి. కాగా డిల్లీలో జరగనున్న రెండు రోజులు కాన్ఫరెన్స్‌కు నూతన పీవో బయలుదేరి వెళ్లినట్టు సమాచారం. మరో మూడు రోజుల తర్వాత నూతన పీవో రంపచోడవరం వస్తారని అధికారులు తెలిపారు.



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు మొక్క అందజేస్తున్న ఐటీడీఏ పీవో

ఉపాధ్యాయుడి అదృశ్యంపై ఫిర్యాదు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం వడ్డిగూడెంలో వైదాని వెంకటరమణప్రసాద్ (52) కుటుంబంతో కలిసి జీవిస్తున్నాడు. ముమ్మిడివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వెంకటరమణప్రసాద్ ఈ నెల 6వ తేదీ ఉదయం ఇంటిన ఉంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. రెండు రోజుల పాటు ప్రసాద్ ఆచూకీ కోసం స్నేహితులు, బంధువుల ఇళ్ల వద్ద గాలించినా ప్రయోజనం లేదు. దాంతో సోమవారం ఉపాధ్యాయుడు ప్రసాద్ భార్య నాగవెంకటవిజయలక్ష్మి అమలాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ కిశోర్‌బాబు తెలిపారు.

విధుల్లో స్పృహ తప్పిన హెడ్ కానిస్టేబుల్

కైకలూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా కైకలూరులో జరుగుతున్న అల్లర్ల నేపథ్యంలో బందోబస్తు నిర్వహించేందుకు వచ్చిన పోలీసు అనారోగ్యానికి గురయ్యాడు. సోమవారం కైకలూరు కరకట్ట వద్ద కాకినాడ 3వ బెటాలియన్‌కు చెందిన ఏపీఎస్పీ హెడ్ కానిస్టేబుల్ డి.అశోక్‌కుమార్ విధులు నిర్వహిస్తున్నాడు. సాయంత్రం 4 గంటల సమయంలో ఆకస్మికంగా స్పృహ తప్పి పడిపోయాడు. దీంతో స్థానిక పోలీసులు హుటాహుటిన కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు.



కైకలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న హెడ్‌కానిస్టేబుల్ అశోక్‌కుమార్

రైతులకు అందుబాటులో యూరియా

అల్లవరం,సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): రైతులకు అందుబాటులో యూరియాఉంచామని నియోజక వర్గ ప్రత్యేకాధికారి డి.రాంబాబు అన్నారు. మొగళ్ల మూరి, బెండమూర్లంకగ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించారు.సహకారసొసైటీల్లో యూరియాఉంచామనిమండలప్రత్యేకాధికారికర్నీడి మూర్తి, తహశీల్దార్ వీవీఎల్ నరసింహ తెలిపారు.

సమస్యల పరిష్కారం కోరుతూ ఆందోళనలు

అమలాపురంటౌన్,సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి):కలెక్టరేట్‌లోని గోదావరిభవన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలోకలెక్టర్, జాయింట్‌కలెక్టర్లతో కలిసి జిల్లారెవెన్యూ అధికారి కె.మాధవి, డ్వామాపీడీ ఎస్.మధుసూదన్, ఎస్‌డీసీ కృష్ణమూర్తి, డీఎల్డీవో రాజేశ్వరరావు 200అర్జీలు స్వీకరించారు.

ఇమామ్‌ల గౌరవ వేతన బకాయిలు చెల్లించాలి:

మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించే ఇమామ్‌లు, మౌజామ్‌లకు చెల్లించాల్సిన 11 నెలల బకాయిలను విడుదల చేయాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. స్టేట్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు వి.ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి అర్జీ అందించారు. ఎన్నికల హామీ మేరకు మసీదు మెయింటెన్స్‌కు నెలకు రూ.5వేలు, షాదీ తోఫా రూ.లక్ష ఇస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు అమలు చేయలేదన్నారు. ఇమామ్‌ల వేతనాలు చెల్లించడంతో పాటు హామీలు అమలు చేయాలని కోరుతూ నినాదాలు చేశారు.



కలెక్టరేట్ ఎదుట కాంట్రాక్టర్ల నిరసన

కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌ఖాదర్, ఎండీమై షరీఫ్, ఖ్వాజా బాబు, అన్వర్‌తాహిర్ హుస్సేన్, కర్రార్ హుస్సేన్, ఎండీ జుబేర్, మీర్జాఆదంబేగ్, నౌషాద్ ఎండీ యూసుబ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే చేయించి భూమిని అప్పగించండి

పసుపు, కుంకుమ మాన్యం కింద ఇచ్చిన భూమిని సర్వే చేయించి దివ్యాంగురాలైన తన కుమార్తెకు అప్పగించి భరోసా కల్పించాలని కోరుతూ అన్నాబత్తుల వెంకటలక్ష్మి అర్జీ అందించారు. ఉప్పలగుప్తం మండలం విలసవిల్లి గ్రామంలో పసుపు కుంకుమ మాన్యం కింద తనకు 83 సెంట్ల భూమి ఇచ్చారని, అయితే ఆభూమిలోకి వెళ్లకుండా భర్త కుటుంబీకులు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఆ భూమిని ఎవరికీ లీజుకు ఇవ్వనివ్వకపోవడం, సొంతంగా సేద్యం చేసేందుకు కూడా అడ్డుకోవడం వల్ల పోరంబోకు భూమిగా మిగిలిపోతుందని పేర్కొన్నారు. దివ్యాంగురాలైన కుమార్తె సాయికిరణ్ (31)కి ఆభూమే ఆధారమని అర్జీలో పేర్కొన్నారు.

పల్లెపండుగ బిల్లులు చెల్లించండి

ఉపాధిహామీ అనుసంధానంతో చేపట్టిన పల్లె పండుగ పనులకు నిధులు విడుదల చేయకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అయినవిల్లి, అమలాపురం, అంబాజీపేట మండలాలకు చెందిన కాంట్రాక్టర్లు అర్జీ అందించారు. పనులు పూర్తిచేసి తొమ్మిది నెలలు గడిచినా ఇంత వరకు ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టి పనులు చేశామన్నారు. కాంట్రాక్టర్లు రాయపురెడ్డి శ్రీనివాస్, బుడితి శ్రీను, పితాని సత్యనారాయణ, బళ్ల బ్రహ్మాజీ, బొంతు బాలకృష్ణ, ఇళ్ల గోపి, మోర్త వీరవెంకటసత్యనారాయణ, చిన్నం విజయరావు, నిమ్మకాయల శ్రీరామచంద్రమూర్తి ఉన్నారు.

ఉచిత బస్సుతో నష్టపోయాం ఆదుకోండి

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు సదుపాయాన్ని కల్పించడంతో నష్టపోయిన ఆటో, క్యాబ్ డ్రైవర్లను ఆదుకోవాలని కోరుతూ ఏపీ ఆటో క్యాబ్, టాటాఏసీ, ట్రాన్స్‌పోర్టు కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. నష్టపోతున్న ప్రతీ డ్రైవరు కుటుంబానికి ఏటా రూ.20వేలు ప్రభుత్వం చెల్లించాలని, కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని నినాదాలుచేశారు. యల్లమిల్లి వెంకటేశ్వరరావు, గుత్తుల మల్లిబాబు, బొంతు శ్రీనివాసరావు, యల్లమిల్లి చంటి, గుత్తుల సుబ్రహ్మణ్యం, మద్దా సత్యనారాయణ నిరసనలో పాల్గొని కలెక్టర్‌కు అర్జీ అందించారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

అంబాజీపేట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా మాట్లాడి రోగులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా ప్రోగ్రాం మోనటరింగ్ అధికారి డాక్టర్ టీకే శ్రీనివాస్ సూచించారు. స్వచ్ఛభారత్, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పలు పీహెచ్‌సీలను ఆయన సోమవారం పరిశీలించారు. పీహెచ్‌సీల్లో రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అందించాలన్నారు. పీహెచ్‌సీల పనితీరు, తదితర వాటిపై త్వరలో సెంట్రల్ టీమ్ పరిశీలిస్తుందన్నారు. అంబాజీపేట, గోడిలంక, ముక్కామల, బెండమూర్లంక, నగరం, గోడిలంక, అమలాపురం అర్బన్, తాటిపాక, నాగుల్లంక, పీహెచ్‌సీలను పరిశీలించామన్నారు. నివేదికను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారికి అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి కేఎస్ శ్రీనివాస్, ఎంపీహెచ్‌ఈవో రంగనాథ్, సీహెచ్‌వో బి.అప్పారావు, సూపర్‌వైజర్ ఎ.రాధానరసింహం, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయాల్లో సంప్రోక్షణ

ముమ్మిడివరం, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): చంద్ర గ్రహణాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం మండలంలోని ప్రముఖ ఆలయాలన్నింటినీ సంప్రోక్షణ నిర్వహించి భక్తులకు దర్శన సౌకర్యాన్ని కల్పించారు. ఆలయాలను సోమవారం ఉదయం ఆరుగంటకు తెరిచి సంప్రోక్షణ నిర్వహించారు. అనంతరం భక్తులకు యథావిధిగా దర్శనాలు, ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ముమ్మిడివరంలోని శ్రీఉమా సూరేశ్వరస్వామి, శ్రీదేవిభూదేవి సమేత కేశవస్వామి ఆలయం, షిర్డిసాయి మందిరాలతో పాటు మండలంలోని పలు ఆలయాలకు సంప్రోక్షణ నిర్వహించి భక్తులకు యథావిధిగా దర్శనాలు కల్పించారు.

భక్తుల తాకిడి

ఐ.పోలవరం,సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): ఆదివారం రాత్రి చంద్రగ్రహణం కావడంతో సోమవారం మురమళ్ల వీరేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. గ్రహణ దోష జాతకులు దోష నివారణ కోసం పూజలు చేయించుకున్నారు. దానాలు సమర్పించారు. ఉదయం 8 గంటలకు సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనంకల్పించారు. అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ భక్తులకు ఇబ్బంది కలగకుండాఏర్పాట్లు చేశారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంపొందించుకోవాలి

ముమ్మిడివరం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మహిళలకు ప్రభుత్వం అమలు చేస్తోన్న పథకాలపై పూర్తి అవగాహన పెంపొందించుకుని, వాటిని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సాధికారిత అధికారిణి వై.విజయశ్రీ పేర్కొన్నారు. ముమ్మిడివరం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సీడీపీవో ఎం.నిహారిక అధ్యక్షతన సోమవారం ముమ్మిడివరం ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు, వన్ స్టాప్ సెంటర్ సిబ్బందికి, లీగల్ కౌన్సిలర్లకు మిషన్‌శక్తి సంకల్పపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసదస్సులో ఆమె మాట్లాడారు. జిల్లాలో సఖివన్‌స్టాప్ సెంటర్‌ద్వారా అందిస్తున్న సేవల కోసం 181టోల్‌ఫ్రీ నంబరు ద్వారా లేదా నేరుగా సంప్రదించవచ్చని ఆమె తెలిపారు. వీటిపై అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలకు, బాలికలకు అవగాహన కల్పించి వాటిని వారు వినియోగించుకునేలా చైతన్యం తీసుకురావాలన్నారు. వన్‌స్టాప్ సెంటర్ సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ ఎం.అంబికాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది, లీగల్‌కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పట్టా భూములకు రుణ సౌకర్యం కల్పించాలి

ముమ్మిడివరం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పట్టా భూములకు రుణ సౌకర్యం కల్పించి పట్టా భూముల రైతులను ఆదుకోవాలని కోనసీమ టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు (బాబు) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ముమ్మిడివరంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం మిగులు భూములను పేదలకు పట్టాలుగా ఇచ్చి అర్థ శతాబ్దం దాటినా ఇప్పటి వరకు ఆయా భూములపై పట్టాదారులకు పూర్తి హక్కులు కల్పించకపోవడం దారుణమన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి అభినందనలు

రాజోలు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును కలెక్టర్ మహేష్‌కుమార్ నుంచి తీసుకున్న ఎ.నారాయణరావుకు సోమవారం ఎంఈవో ఎస్.మనోహరం అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయిలో అవార్డు సాధించిన సీహెచ్ నిరంజని, మండలం నుంచి జిల్లాకు ఉత్తమ అవార్డు పొందిన డి.శ్రీనివాస్, టి.శ్రీనివాస్‌మహేష్, కేఆర్‌ఎస్ పద్మావతిలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో-2 టీఎస్‌కేడీ ప్రసాదరావు, ఎస్టీయూ అధ్యక్షుడు పీవీపీ సత్యనారాయణమూర్తి, కార్యదర్శి వైవీవీ ప్రసాద్, ఉమ్మడి జిల్లా అభయ్ కన్వీనర్ ఆర్ఆర్కే ప్రసాద్, ఆఫీసుసిబ్బంది పాల్గొన్నారు.

విద్యా రంగ సమస్యలపై యూటీఎఫ్ రణభేరి



మామిడికుదురులో యూటీఎఫ్ రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

మామిడికుదురు,సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ ఆధ్వర్యంలో రణభేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి సీహెచ్ కేశవరావు పేర్కొన్నారు. మామిడికుదురు విద్యా వనరుల కేంద్రం వద్ద సోమవారం రణభేరి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల15 నుంచి 19వరకు విద్యా రంగ ఆర్థిక సమస్యలపై రణభేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15నెలలు గడస్తున్నప్పటికీ ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదని, బోధనేతర పనులు విపరీతంగా పెరిగిపోయి బోధనలకు సమయం సరిపోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మండలశాఖ అధ్యక్షుడు జి.నాగేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి బాలంపెద్దిరాజు, టీఆర్కే గణపతిరావు, ఆర్.శ్రీనివాసరావు, వీఎస్వీ సత్యబాబు, పి.సత్యకృష్ణ పాల్గొన్నారు.

ఆదుకోవాలని ఆటో డ్రైవర్ల ధర్నా



వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ జిల్లా అధ్యక్షుడు సత్తిరాజు తదితరులు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సదుపాయాన్ని కల్పించడంతో ఆటో కార్మికుల పరిస్థితి దారుణంగా మారిందని తక్షణం ఆటో డ్రైవర్లకు ఉపాధి అవకాశాలు మెరుగు పరిచే విధంగా చర్యలు తీసుకోవాలని ఆంధ్ర ఆటోవాలా యూనియన్ జిల్లాశాఖ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.సత్తిబాబు, జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రాపిడో, ఊబర్ వంటి ప్రైవేటు యాప్‌లు కోనసీమ జిల్లాలో ప్రవేశించడంతో ఆటో కార్మికుల ఉపాధి దెబ్బతిందన్నారు. తక్షణం ప్రైవేటు యాప్‌ను రద్దుచేసి ప్రభుత్వమే ఒక యాప్‌ను క్రియేట్‌చేసి ప్రయాణికులకు భద్రతతో కూడిన ప్రయాణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఊటాల వెంకటేష్, కార్యవర్గ సభ్యులు బొలిశెట్టి శంకరం, బొక్కా నాని, గుత్తుల రామ్మకృష్ణ, ఫణీంద్ర, మడికి చంద్రశేఖర్, జిల్లాలోని వివిధ యూనిట్ల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

కదం తొక్కిన ఉపాధి వేతనదారులు

అంతర్వేది, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉపాధి వేతనదారులు సమస్యలు పరిష్కరించాలని ఏపీవో నాగప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. 15 రోజుల వేతనాలు చెల్లించాలని ఉపాధి చట్టం చెబుతున్నా రెండు నెలల నుంచి వేతనాలు అందలేదని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండలంలో ఉన్న ఉపాధి వేతనదారులు, మేట్లు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న ఉపాధి వేతనదారులు

సొసైటీల్లో అందుబాటులో యూరియా

పి.గన్నవరం,సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి):ప్రాథమికవ్యవసాయ పరపతి సంఘాల్లో యూరియాను అందుబాటులో ఉంచామని మండల ప్రత్యేకాధికారి, హౌసింగ్ పీడీ ఎంవీ నరసింహారావు తెలిపారు. ముంగండ, రాజులపాలెం, పి.గన్నవరం గ్రామాల్లో యూరియా సరఫరా, నానోయూరియా వాడకంపై రైతులకు సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. తహశీల్దార్ పి.శ్రీపల్లవితో కలిసి ఆయన మాట్లాడారు. ఇన్‌చార్జిఏడీఏ సీహెచ్ డీ విజయకుమార్ మాట్లాడుతూ ముంగండ సొసైటీలో 10.125టన్నులు, నాగుల్లంక సొసైటీలో 10.125టన్నులు,నరేంద్రపురం సొసైటీలో యూరియా అందుబాటులో ఉంచామన్నారు.

రైతులకు ఎరువులు అందించడంలో ప్రభుత్వం విఫలం

రైతులకు ఎరువులను పూర్తిస్థాయిలో అందించడంలో ప్రభుత్వం విఫలమైందని నియోజకవర్గ వైసీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఆరోపించారు. పోతవరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మంగళవారం కొత్తపేటలో జరిగే అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అన్నదాత పోరు గోడ పత్రికను విడుదల చేశారు.

వైనతేయ రేవుల్లో పడవలపై రాకపోకలు ప్రారంభం

అల్లవరం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): గోదావరి వరదల నేపథ్యంలో వైనతేయ రేవులో నిలిచిపోయిన పడవల రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి. వైనతేయ వరద ప్రవాహానికి ప్రమాదాలు జరగకుండా అల్లవరం మండలం ఓడలరేవు-కరవాక, బెండమూర్లంక-గోగన్నమఠం వైనతేయ గోదావరి రేవుల్లో పడవలపై ప్రయాణికుల రాకపోలు కొన్ని వారాలు నిలిచిపోగా సోమవారం నుంచి తిరిగి ప్రారంభమయ్యాయి. ఓడలరేవు, బెండమూర్లంక రేవుల ద్వారా పడవలపై ప్రయాణికుల రాకపోకలు ప్రారంభించినట్టు తహశీల్దార్ వీవీఎల్ నరసింహారావు తెలిపారు.

వేదుల హనుమాన్‌కు సన్మానం

కాట్రేనికోన, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): అమలాపురం శంకరమఠంలో ఆపస్థంభ పురోహిత పరిషత్ ఆధ్వర్యంలో కాట్రేనికోనకు చెందిన వేదుల ఆంజనేయ మూర్తి(హనుమాన్)ను సత్కరించారు. వంశ పారంపర్యంగా పౌరోహిత్యం చేస్తున్న హనుమాన్ చిన్నప్పుడే స్మార్తవిద్య, జ్యోతిష్య వాస్తుశాస్త్రాలు,వ్యాకరణం, సాహిత్యం నేర్చుకున్నారు. వివాహాలు, దేవతా విగ్రహాల ప్రతిష్ఠ వంటి కార్యక్రమాల్లో ఆయన ప్రత్యేకత సంతరించుకున్నారు. హనుమాన్‌కు సత్కారం పట్ల మండల బ్రాహ్మణ సేవాసంఘం హర్షంవ్యక్తం చేసింది.

ప్రజ్ఞా పురస్కార్ అవార్డుల ప్రదానం

అమలాపురం టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా కోనసీమ జిల్లాశాఖ ఆధ్వర్యంలో అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్‌లో మధు పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. దమ్మ బోధకులు కాశి రాంబోధి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు వై.హరిబాబు, ఉపాధ్యక్షుడు డీబీ లోక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బుద్ధవిహార్‌లో ప్రత్యేకప్రార్థనలు నిర్వహించారు. అనంతరం జిల్లాలో వివిధ రంగాల్లో ప్రతిభకనబరిచిన వారికి ప్రజ్ఞాపురస్కార్ అవార్డులను అందజేశారు.ఉత్తమఉపాధ్యాయులు, వివిధరంగాల్లో నిష్ణాతులైన ఆయుష్మాన్ కాశి రాంబోధి, ఆయుష్మతి ప్రజ్ఞాశ్రీనివాస్‌తోపాటు డాక్టర్ ఎంఏకే భీమారావు, నక్కా శ్రీనివాస్, పెట్టా వెంకట్రావు, కాశి వెంకట్రావు, నేరేడుమిల్లిసత్యనారాయణ, డాక్టర్ ఉప్పే సత్యనారాయణ, నేలమూడి మసేనురావు, విప్పర్తి ప్రభాకరరావు, విప్పర్తి భానోజీరావు, కడిమి వీఎస్ దుర్గారావు, సర్‌సీవీరామన్‌విద్యాసంస్థలఅధినేత రవణం వేణు, కోలా త్రిమూర్తులును ప్రజ్ఞాపురస్కారాలతో సత్కరించారు. కూరటి విశ్వనాథం, కోడూరి రామమూర్తి, మర్రి సత్యంమూర్తి, జిల్లా ప్రధానకార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

వరల్డ్ ఫిజియోథెరపీ డే వేడుకలు

యానాం, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి):యానాంచిల్డ్రన్స్ ఆడిటోరియంలో వరల్డ్ ఫిజియోథెరపీ వేడుకను ఘనంగా నిర్వహించారు. భారత సామాజిక సాధికారత మంత్రిత్వశాఖ సహకారంతో నిర్వహిస్తున్న నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్మెంట్ ఆఫ్ పర్సన్ విత్ ఇంటలెక్చువల్ డిజబులిటీస్ డైరెక్టర్ బీవీ రామ్‌కుమార్ ఆధ్వర్యంలో సోషల్ వెల్ఫేర్, ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ సహకారంతోఈకార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పరిపాలనాధికారి అంకిత్‌కుమార్ మాట్లాడారు. ఆపరేషన్ ద్వారా నయం కాలేని సమస్యలను ఫిజియోథెరపీ ద్వారా నయంఅవుతాయన్నారు. అనంతరం డాక్టర్ యేతేంద్ర కుమార్, ఈడీ ఎస్వీ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మిషన్‌శక్తి కోఆర్డినేటర్ రిఫ్కా రోషియే, శ్రీకాంత్, ప్రత్యేక పాఠశాల ఇన్‌చార్జ్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్‌ఐపై అవగాహన సదస్సు

మలికిపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నిబంధనలు అనుసరించి ప్రతీ ఒక్కరూ ఈఎస్‌ఐ పరిధిలోకి వస్తే వారికి భవిష్యత్తులో ప్రభుత్వం ద్వారా లభించే రాయితీలు పొందవచ్చునని ఈఎస్‌ఐ అధికారి కిశోర్‌కుమార్ అన్నారు. విశ్వేశ్వరాయపురం వివేకానంద పాఠశాలలో ఈఎస్‌ఐ, లేబర్ అధికారి ఆధ్వర్యంలో రాజోలు డివిజన్‌లోని ఐదు మండలాల ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలతో పలు సమస్యలపై అవగాహన ఏర్పాటు చేశారు. ఈఎస్‌ఐ పరిధిలో ఉన్న వారు కార్పొరేట్ స్థాయిలో వైద్య సదుపాయం పొందవచ్చన్నారు. ప్రతీ ఒక్కరూ స్కూలు వాహనానికి లేబర్ లైసెన్సు పొందాలన్నారు. ప్రైవేటు స్కూల్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోపీనాథ్, రమణారావు, అయ్యప్పనాయుడు, బీవీవీ ప్రసాద్, రత్నరాజు, పోతురాజు చిన్నా, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నవ సమాజ నిర్మాతలు

ఉప్పలగుప్తం, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు నవ సమాజ నిర్మాతలని పలువురు ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు వ్యాఖ్యానించారు. భీమనపల్లి శ్రీమతిశిరంగు రంగనాయకమ్మ జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం నూకల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ గుర్లింక చిన్నా, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు కోడూరి ధర్మారావు, యార్లగడ్డ భాస్కర్‌శాస్త్రి, నూకల సత్యనారాయణ, సలాది దొరయ్యనాయుడు దంపతులకు సన్మానం జరిగింది. కార్యక్రమంలో నడింపల్లి పద్మనాభన్, కుడుపూడి భాగ్యలక్ష్మి, వేటూరి వెంకటేశ్వరరావు, కామన మధు, సుబ్బారావు, రాంబాబు, రాజేశ్వరి, అనుపమ, రత్నకుమారి, శ్రావణి, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

మూడేళ్లకోసారి ఆభరణాల తనిఖీలు

అసిస్టెంట్ కమిషనర్ పల్లంరాజు

ఆలమూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): దేవదాయ ధర్మాదయ శాఖ అధ్వర్యంలో నడుస్తున్న అన్ని ఆలయాల్లో ప్రతి మూడేళ్లకు ఒకసారి బంగారం, వెండి ఆభరణాలను తనిఖీలు చేస్తామని అసిస్టెంట్ కమిషనర్ ఇళ్ల పల్లంరాజు తెలిపారు. శ్రీకాకుళం నుంచి ఎన్టీఆర్ జిల్లా వరకు ప్రతి మూడేళ్లకు ఆయా ఆలయాల్లో తనిఖీలు చేస్తామన్నారు. ఆలమూరులో ని శ్రీదేవి భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయంలో ఆభరణాలు తనిఖీలు చేశామ న్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాదయశాఖ నిబంధన మేరకు ఆలయానికి ఉన్న అన్ని ఆభరణాలు తనిఖీలు చేయాల్సి ఉందన్నారు. ఆలమూరు ఆలయంలో అన్ని ఆభరణాలు సక్రమంగానే ఉన్నాయని వివరించారు. కార్యక్రమం లో ఆలయ ఈవో నరేంద్రకుమార్, ట్రస్టు బోర్డు చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, సభ్యులు చిన్నం సుబ్బలక్ష్మి, అయినవిల్లి శ్రీనివాస్, అర్చకులు ప్రభాకరాచార్యులు, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.



ఆలమూరు జనార్దనస్వామి ఆలయంలో ఆభరణాలను తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ పల్లంరాజు

చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని హోమం

రాయవరం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి వెదురుపాక విజయదుర్గా పీఠంలో విజయదుర్గ అమ్మవారికి, పరివార దేవతలకు, నవగ్రహాలు, 27 నక్షత్రాలకు హోమం నిర్వహించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వేద పండితులు రాత్రి 9.56 గంటల నుంచి రాత్రి 1.26 వరకు హోమం జరిపి పూర్ణాహుతి జరిపారు. అనంతరం అమ్మవారికి, పరివార దేవతలకు సంప్రోక్షణ చేసి ఉదయం 8గంటల నుంచి దర్శనాలకు అనుమతించారు. కార్యక్రమంలో విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్యవెంకట కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి కనకదుర్గ, బుజ్జి, పీఆర్వో బాబి భక్తులు పాల్గొన్నారు.



వెదురుపాక విజయదుర్గా పీఠంలో గ్రహణ సమయంలో హోమం జరుపుతున్న దృశ్యం

సంప్రోక్షణ అనంతరం తెరుచుకున్న ఆలయాలు

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని ఆదివారం మధ్యాహ్నం నుంచి మూసివేసిన ఆయా ఆలయాలు సంప్రోక్షణ అనంతరం తిరిగి సోమవారం ఉదయం తెరుచుకున్నాయి. అంగర వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు మండలంలోని వేణుగోపాలస్వామి, జనార్దనస్వామి, అగస్త్యేశ్వర పాపవినాశేశ్వరస్వామి తదితర ఆలయాల్లో అర్చకులు సంప్రోక్షణ అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. అంగర వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు కె.బాలబాలాజీ ఆచార్యులు ఆధ్వర్యంలో పలువురు పండితులు సంప్రోక్షణ అనంతరం స్వామివారి దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పలు పూజలు చేశారు. కార్యక్రమాల్లో గ్రామస్థులతో పాటు భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



అంగర వెంకన్న ఆలయంలో సంప్రోక్షణ జరుపుతున్న అర్చకుడు బాలబాలాజీ ఆచార్యులు

ఆరోగ్య బీమాతో మేలు

రావులపాలెం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతి కుటుంబానికి రూ.25లక్షల ఆరోగ్యబీమా అందేలా చర్యలు తీసుకోవడంతో ప్రతి ఒక్కరికి మేలు చేకూరుతుందని వక్తలన్నారు. రావులపాలెంలో కొత్తపేట నియోజకవర్గ సెల్ అధ్యక్షులు గుత్తుల కేశవరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే బండారు మాట్లాడారు. ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టినందుకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. రాయుడు శివరామకృష్ణ, విత్తనాల హరికృష్ణ, సాపిరెడ్డి శ్రీనివాస్, ఆర్. దుర్గా ప్రసాద్, కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం

రావులపాలెం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఈతకోటలో కొడమంచిలి శేఖర్, కొల్లి సత్యవతి గృహాలు అగ్నిప్రమాదంలో దగ్ధమయ్యాయి. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే బండారు అక్కడికి వెళ్లి బాధితులను పరామర్శించి అండగా ఉంటామని ఆర్థికసాయం అందజేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సాయం త్వరగా అందించాలని తహసీల్దారును ఆయన ఆదేశించారు.

పనిభారం తగ్గించాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వార్డు, సచివాలయ ఉద్యోగులపై పనిభారం తగ్గించాలని పట్టణంలోని సచివాలయ ఉద్యోగులు సోమవారం మున్సిపల్ కమిషనర్ రాజేశ్వరరాజుకు వినతిపత్రం అందజేశారు. సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర సంఘం పిలుపు మేరకు వినతిపత్రం అందచేశామన్నారు. మద్దాల బాపూజీ ఆధ్వర్యంలో

రాయవరం ఆసుపత్రి సందర్శన

రాయవరం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాయవరం ప్రభుత్వ ఆసుపత్రిని సోమవారం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి వి.సత్యనారాయణ సందర్శించారు. ఆసుపత్రుల్లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల అమలును పరిశీలించి, వైద్యులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు రమ్యశ్రీ, సీహెచ్‌వో ప్రభావతి, హెచ్.వి సత్యవతి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లెక్సీ చింపివేసిన ఘటనపై ఫిర్యాదు

రాయవరం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వెల్లంపేట రామాలయం వద్ద జనసైనికులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చింపివేసిన ఘటనపై సోమవారం రాయవరం పోలీసులకు జనసైనికులు ఫిర్యాదు చేశారు. దీనికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రాయవరం ఎస్ఐ డి. సురేష్‌బాబుకు వారు ఫిర్యాదు చేశారు.

బాలికకు ఆర్థికసాయం

రావులపాలెం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇటీవల కొంత మంది ఆకతాయిల అల్లర్లలో గాయపడిన బాలికకు వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్థికసాయం అందజేశారు. ఈతకోటకు చెందిన మానే వెంకట ఐశ్వర్య అనే బాలిక శస్త్ర చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటోంది. సోమవారం ఆ బాలికను పరామర్శించిన అనంతరం రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు.

యూరియా కొరత లేదు

• రైతులకు అధికారులు అవగాహన కార్యక్రమాలు • వదంతులు నమ్మవద్దని హితవు



ఆత్రేయపురం మండలం వద్దిపర్రు రైతుసేవా కేంద్రం వద్ద రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): యూరియా కొరత లేకుండా రైతులకు అందుబాటులో ఉంచినట్టు తహసీల్దార్ జి.శ్రీనివాస్, ఏవో బి.రవి తెలిపారు. సోమవారం మండలంలోని కాలేరు, నల్లూరు, వెదురుమూడి గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి ఆధ్వర్యంలో రైతులతో నిర్వహించిన అవగాహన సమావేశా ల్లో వారు మాట్లాడారు. రైతులు కంగారు పడ వద్దని హితవు పలికారు. కార్యక్రమాల్లో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆర్.ప్రసాద్, పలువురు ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో 60 టన్నుల యూరియా

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం వద్దిపర్రు రైతు సేవా కేంద్రం వద్ద సోమవారం కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఫార్మర్ అవుట్ రీచ్ కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకాధికారి, పంచాయతీరాజ్ ఈఈ రామకృష్ణ ఎరువుల లభ్యతపై రైతులకు అవగాహన కల్పించారు. ఆత్రేయపురం, అంకంపాలెం సొసైటీలలో 60 టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు రాజేశ్వరరావు, వ్యవసాయ అధికారి మహేష్‌కుమార్, నీటి సంఘం అధ్యక్షుడు హరిబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

రాయవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని నదురుబాద, పసలపూడి గ్రామాల్లో సోమవారం యూరియా లభ్యతపై రైతులకు అవగాహన సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏవో కేవీఎస్ రమేష్ కుమార్, తహసీల్దారు ఐపీ శెట్టి మాట్లాడుతూ యూరియా కొరత లేదని రైతులకు తెలిపారు. సొసైటీల ద్వారా రైతులకు యూరియా అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రామచంద్రపురం వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, సొసైటీ డైరెక్టర్లు అనుసూరి శ్రీనివాస్, బుంగా పెద్ద తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా అందుబాటులో ఉందని ఏవో కె.ద్వారక దేవి తెలిపారు. యూరియా కొరత ఉందన్న వదంతులను రైతులు నమ్మవద్దన్నారు. రైతు సేవా కేంద్రాలు సొసైటీ, ప్రైవేట్ డీలర్ల వద్ద యూరియా అందుబాటులో ఉందన్నారు.

వాడపల్లి ఆలయానికి విరాళం

ఆత్రేయపురం, సెప్టెంబరు 8(ఆంధ్ర జ్యోతి): వాడపల్లి వెంకన్న అన్నప్రసాద ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన గొల్కొండ సింహాద్రి వెంకట విజయహనుమ, సూర్యకళ దంపతులు రూ.25,116 విరాళం అందజేశా రు. దాతలకు ఆలయ సిబ్బంది స్వామివారి ఫొటో, ప్రసాదం అందజేశారు.

ఏరియా ఆసుపత్రిలో డయాలసిస్, ఫిజియోథెరపీ యూనిట్



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని మంత్రి సుభాష్ అన్నారు. సోమవారం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి సమకూర్చిన అడ్వాన్స్ లైఫ్ సపోర్టు 108 అంబులెన్స్‌ను మంత్రి ప్రారంభించారు. ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల వరకు ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందజేస్తుందన్నారు. త్వరలో స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో డయాలసిస్, ఫిజియోథెరపీ యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్, డిజాస్టర్ మేనేజ్‌మెంటు అధికారి అవినాష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, వైద్య సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా ప్రత్యేక చర్యలు

ద్రాక్షారామ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కొరత లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆర్డీవో దేవరకొండ అఖిల అన్నారు. సోమవారం ఓదూరులో యూరియాపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రైతులు నానో యూరియా వాడకంపై దృష్టిసారించాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి టీవీఆర్ మణిదీప్, ఏడీఏ బి.నాగకుమార్ తదితరులతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అదే విధంగా యనమదల, కాపవరం, ఏరుపల్లి గ్రామాల్లో రైతు సదస్సులు జరిగాయి.

రాజకీయ మనుగడ కోసం వైసీపీ తంటాలు

ఎమ్మెల్యే బండారు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యానందరావు

రావులపాలెం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతుండటంతో రాజకీయ ఉనికి కోసం వైసీపీ నాయకులు పీట్లు చేస్తున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తపేట నియోజకవర్గంలో యూరియా కొరత లేదన్నారు. వైసీపీ నాయకులు అన్నదాత పోరు అంటూ రైతులను రెచ్చగొట్టాలని చూస్తున్నారన్నారు. ఐదేళ్ల పాలనలో ప్రజలకు నరకం చూపించిన వైఎస్ జగన్ ఇప్పుడు మొసలి కన్నీరు కార్చడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సమాజం ఉపాధ్యాయులతోనే సాధ్యం

ద్రాక్షారామ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మెరుగైన సమాజం ఉపాధ్యాయులతోనే సాధ్యమవుతుందని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన గురుపూజోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా ఉత్తమ ఉపాధ్యాయులు, ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా సత్యంతో పాటు ఎంపీపీ అంబటి భవానీ, ఎంఈవోలు వీరరాఘవ రెడ్డి, నాగేశ్వరి, ఎస్‌కెవీపీ ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ సలాది వెంకప్ప నాయుడు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ గరిగిపాటి సూర్యనారాయణ, నియోజకవర్గ పరిశీలకుడు కాకినాడ రామారావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు వుండవిల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల ఆక్రమణను అడ్డుకోవాలి

ఆలమూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నర్సిపూడిలో చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయని వాటిని అడ్డుకోవాలని కోరుతూ నర్సిపూడి గ్రామస్తులు గ్రీవెన్స్‌లో మండల పరిషత్ ఏవో మోహర్‌ప్రకాష్‌కు వినతిపత్రం అందించారు. నర్సిపూడి గ్రామానికి చెందిన నాయకులు, ప్రజలు భారీగా వచ్చి వినతిపత్రం అందించారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపడతామని ఆయన హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి ఎమ్మెల్యే అండ

కొత్తపేట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పలివెల ఉమాకొప్పేశ్వర ఆలయ ఆవరణలో జరిగే అన్నదాన కార్యక్రమానికి వెళుతున్న కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మార్గమధ్యలో రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తిని చూసి చలించిపోయారు. వెంటనే కాన్వాయ్‌ను ఆపి క్షతగాత్రుడిని కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేందుకు ఏర్పాటు చేశారు. సత్వరమే మెరుగైన వైద్యం అందించాలని, అవసరమైతే మెరుగైన వైద్యం అందించేందుకు రాజమహేంద్రవరం తరలించాలని ఆస్పత్రి వైద్యులకు ఆయన సూచించారు.



తెలంగాణ సీఎం ముఖ్య కార్యదర్శి కేఎస్ శ్రీనివాస రాజును కలిసి మాట్లాడుతున్న పదాల రామిరెడ్డి

తెలంగాణ ముఖ్య కార్యదర్శిని కలసిన రామిరెడ్డి

రావులపాలెం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రావులపాలానికి చెందిన స్వర్ణాంధ్ర సేవా సమితి ఫౌండర్ పదాల రామిరెడ్డి, తెలంగాణ సీఎం ముఖ్య కార్యదర్శిని కేఎస్ శ్రీనివాసరాజును మర్యాద పూర్వకంగా కలిసినట్లు ఆయన తెలిపారు. ఆయన్ను వాడపల్లి వెంకన్న దర్శనానికి రావాలని ఆహ్వానించినట్లు తెలిపారు.

ఆన్‌లైన్‌లో ఇంటి పన్ను చెల్లింపు

ద్రాక్షారామ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్వర్ణ పంచాయతీ డిజిటలైజేషన్‌లో భాగంగా పంచాయతీల్లో పన్నుల చెల్లింపును ఆన్‌లైన్ చేశారు. కాపవరం పంచాయతీలో మొదటిసారిగా ఆన్‌లైన్‌లో ఇంటి పన్ను చెల్లించిన వ్యక్తికి ఎంపీటీసీ రెడ్నం సతీష్ రశీదు అందజేశారు.